

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 332 | హైదరాబాద్ | ఆదివారం | 10-05-2026 | పేజీలు: 08




## ప్రధానికి కవిత బహిరంగ లేఖ!

**తెలంగాణ ప్రయోజనాల కోసం నాలుగు అంశాలను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి**

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వాలని విజ్ఞప్తి**

**ఓబీసీ ఉపకోటాతో మహిళా రిజర్వేషన్ బిల్లు తిరిగి ప్రవేశపెట్టాలన్న కవిత**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేడు (మే 10) తెలంగాణలో పర్యటించనున్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రం, ప్రజల ప్రయోజనాలు, దేశంలో సామాజిక న్యాయ సాధనకు సంబంధించిన నాలుగు కీలక అంశాలను తక్షణమే పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

తెలంగాణ ప్రజలకు, భారతదేశంలో విస్తృత సామాజిక న్యాయ సాధనకు అత్యంత కీలకమైన నాలుగు విషయాలను ఒక బాధ్యత కలిగిన పౌరురాలిగా మీ దృష్టికి ..మిగతా 2లో

## విశ్వనగరంగా హైదరాబాద్

**'తెలంగాణ రైజింగ్-2047' మాస్టర్ ప్లాన్**

**పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో సీఎం రేవంత్ వివరణ**

**నగరాన్ని సిగ్నల్ రహితంగా మార్చేందుకు ప్రణాళికలు**

**అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ పద్ధతులతో మార్పులు**

**రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు రకాలుగా వర్గీకరణ.**

**సర్వీస్, మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రికల్చర్ సెక్టార్లకు గుర్తింపు**

**కేవలం రోడ్ల విస్తరణే కాకుండా బహుళ రవాణా వ్యవస్థల బలోపేతం**

**కాలుష్య నియంత్రణలో భాగంగా ఈవీ బస్సులు**

**ఉచిత రెట్రో ఫిట్టింగ్ ఆటోల పంపిణీ**

**రాష్ట్ర సంస్కృతితో మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి అనుసంధానం**

**పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక విజన్‌ను ఆవిష్కరించారు. ఆధునీకరణ మరియు పట్టణీకరణ వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అత్యవసరమని, ఈ క్రమంలోనే 'తెలంగాణ రైజింగ్ 2047' పేరుతో ఒక బృహత్తర ..మిగతా 2లో



## హనీట్రాప్ వివాదంలో కేంద్ర మంత్రి కుమారుడు

**మరోసారి చర్చలోకి బండి సంజయ్ కొడుకు**

**ఎదురుదాడి చేస్తున్న యువతి కుటుంబం**

**రెండు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు**

**పథకం ప్రకారం ట్రాప్ చేశారన్న బండి భగీరథ్**

**రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని ఆరోపణలు**

**పరిచయాన్ని అడ్డుపెట్టుకుని బెదిరింపులు**

**ఇప్పటికే రూ.50 వేల వరకు చెల్లించినట్లు వెల్లడి**

**భగీరథ్‌పై హైదరాబాద్‌లో యువతి కుటుంబం ఫిర్యాదు**

**పోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర రాజకీయ మరియు సామాజిక వర్గాల్లో ఒక అనూహ్యమైన వార్త తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు ..మిగతా 2లో



## బెంగాల్ గడ్డపై కమలం సర్కార్

9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం

కోల్‌కతాలోని బ్రిగేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా కార్యక్రమం

అసెంబ్లీ ఎన్నికల్లో 207 స్థానాలతో బీజేపీ ప్రభంజనం

పదిహేనేళ్ల టీఎంసీ పాలనకు చరమగీతం

దీదీని ఓడించి సీఎం పీఠాన్ని అధిరోహించిన సువేందు.

సువేందుతో పాటు మంత్రుల ప్రమాణ స్వీకారం

హాజరైన ప్రధాని మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్‌తో అభివృద్ధి

నవ శకం ప్రారంభమైందన్న సీఎం సువేందు అధికారి

**కోల్‌కతా, (ప్రజాక్షేత్రం):**

పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. మూడు దశాబ్దాల కమ్యూనిస్టుల పాలనను, గత పదిహేనేళ్లుగా సాగుతున్న తృణమూల్ కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యాన్ని తుడిచిపెట్టేస్తూ భారతీయ జనతా పార్టీ బంగాల్ గడ్డపై తన జెండాను ఎగురవేసింది. శనివారం కోల్‌కతాలోని చారిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జనసందోహం మధ్య పశ్చిమ బెంగాల్ 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ..మిగతా 2లో





## విజయ్‌కు లైన్ క్లియర్

**ఎట్టకేలకు మద్దతు ఇచ్చిన వీసీకే**

**టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు పరిస్థితి అనుకూలం**

**వీసీకే మద్దతుతో 118కి చేరిన విజయ్ పార్టీ బలం**

**కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం ఇప్పటికే టీవీకేకు మద్దతు**

**మేజిక్ ఫిగర్‌కు చేరువలో తమిళగ వెట్రి కజగం**

**అధికారిక లేఖతో రాజకీయ ఉత్కంఠకు తెరపడినట్లు సంకేతాలు**

**రెండు స్థానాల్లో గెలిచిన విజయ్‌కు పెరుగుతున్న బలం**

**తమిళనాడు రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాలు**

**ప్రతిపక్షాల ఏకీకరణతో టీవీకేకు భారీ ఊపు**

**ప్రభుత్వ ఏర్పాటుపై తీవ్ర చర్చలకు తెరలేపిన తాజా పరిణామం**

**వీసీకే నిర్ణయంతో కీలక మలుపు తీసుకున్న తమిళ రాజకీయాలు**

**చెన్నై, (ప్రజాక్షేత్రం):**

తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై నెలకొన్న ఉత్కంఠకు దాదాపు తెరపడిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీకి వరుసగా రాజకీయ మద్దతు పెరుగుతూ వస్తుండగా, తాజాగా వీసీకే (విడుదలై చిరుతైగల్ కట్చి) అధికారికంగా మద్దతు ప్రకటించడంతో రాజకీయ సమీకరణాలు మరింత స్పష్టతకు వచ్చాయి.

వీసీకే అధినేత తిరుమావళవన్, టీవీకే పార్టీ నేత ఆదవ్ అర్జునకు లేఖ ద్వారా ఈ మద్దతును ..మిగతా 2లో

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

**ప్రజా దర్బార్ దరఖాస్తులు మూడు నెలల్లో పరిష్కారం**

**ప్రజా సమస్యల పరిష్కారానికి పక్కా కార్యాచరణ సిద్ధం**

**పాలేరు నియోజకవర్గంలో ప్రజా దర్బార్‌లకు భారీ స్పందన**

**14,700 దరఖాస్తులు స్వీకరించాం**

**ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలపై అధిక ఫిర్యాదులు**

**స్పాట్‌లోనే సమస్యల పరిష్కారానికి చర్యలు**

**ప్రజల సమస్యలు పెండింగ్‌లో ఉండవు: అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు**

**మూడు నెలల్లో ప్రతి దరఖాస్తు పరిష్కారమే లక్ష్యం**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ప్రజా దర్బార్‌లో స్వీకరించే ప్రతి దరఖాస్తును మూడు నెలల కాలపరిమితిలోపు పరిష్కరించేలా పక్కా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ ..మిగతా 2లో

## తుమ్మిడిహట్టి పేరుతో కాంగ్రెస్ కొత్త డ్రామా

ప్రాజెక్టులపై సీఎం, మంత్రులకు అవగాహన లేదు

మేడిగడ్డ మరమ్మతులకు భయపడుతోంది కాంగ్రెస్

తుమ్మిడిహట్టి, ఎల్లంపల్లి వ్యాఖ్యలపై హరీష్ తీవ్ర విమర్శలు

సీఎం రేవంత్, మంత్రుల మాటలు మతి లేనివి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది

మహారాష్ట్ర అనుమతులపై వివేక్ వ్యాఖ్యలు అబద్ధాలు

ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ నేతలలో సమన్వయం లేదు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామిలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. మేడిగడ్డ మూడు పిల్లర్లను మరమ్మతులు చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని.. తుమ్మిడిహట్టి పేరిట నయా నాటకానికి తరలిపారని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీష్ రావు మాట్లాడుతూ.. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి హయాంలోనే 150 మీటర్లకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడడం పచ్చి అబద్ధమన్నారు. తమ్మిడిహట్టి నుంచి ..మిగతా 2లో

# బెంగాల్ గడ్డపై కమలం సర్కార్

**మొదటిపేజీ తరువాయి**

అత్యంత వైభవంగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆయనతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. ఒకప్పుడు మమతా బెనర్జీకి కుడిభుజంగా ఉండి, ఆ తర్వాత ఆమెపైనే రాజకీయ యుద్ధం ప్రకటించిన సువేందు అధికారి, నేడు ఆమెనే ఓడించి ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకోవడం బెంగాల్ రాజకీయాల్లోనే అతిపెద్ద మలుపుగా పరిగణించవచ్చు. ఈ కార్యక్రమం కేవలం ఒక ప్రభుత్వ మార్పుగానే కాకుండా, బెంగాల్ సంస్కృతి, రాజకీయ పునరేకీకరణకు వేదికగా నిలిచింది. 1971 సంవత్సరం తర్వాత కలకత్తా పరిసర ప్రాంతాలకు చెందని వ్యక్తి ముఖ్యమంత్రి కావడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

ఈ అపూర్వ ఘట్టానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా హాజరై నూతన ప్రభుత్వానికి తన మద్దతును ప్రకటించారు. ప్రమాణ స్వీకార వేదిక వద్దకు మోదీ, సువేందు అధికారి ఒకే వాహనంలో రావడం అక్కడికి తరలివచ్చిన లక్షలాది మంది కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. దారిపొడవునా ప్రధాని మోదీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ జనం నీరాజనాలు పలికారు. వేదికపైకి రాగానే బెంగాల్ ఆరాధ్య దైవంగా భావించే రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి ప్రధాని నివాళులర్పించారు. కేవలం రాజకీయ నాయకులే కాకుండా, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు తమ సంప్రదాయ నృత్యాలు, సంగీత వాయిద్యాలతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని తలపించేలా చేశారు. బెంగాల్ సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా బీజేపీ ప్రజలకు మరింత చేరువయ్యే ప్రయత్నం చేసింది.

ముఖ్యమంత్రితో పాటుగా బీజేపీ అగ్రనేతలు దిలీప్ ఘోష్, అగ్నిమిత్రా పాల్, అశోక్ కీర్తనియా, నిశీథ్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడూ రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మరియు ఇతర ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరై సువేందు అధికారికి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సైతం ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. దేశంలోని హేమాహేమీ నేతలంతా ఒకే వేదికపై కనిపించడంతో కోల్‌కతా నగరం రాజకీయ కేంద్రబిందువుగా మారింది. ఈ కూటమి ఐక్యత చూస్తుంటే రాబోయే రోజుల్లో బెంగాల్ అభివృద్ధిలో కేంద్రం మరియు ఇతర రాష్ట్రాల సహకారం మెండుగా ఉంటుందని స్పష్టమవుతోంది.

ఈ వేడుకలో అందరినీ కదిలించిన ఒక అద్భుత సన్నివేశం ఆవిష్కృతమైంది. ప్రధాని నరేంద్ర మోదీ తనదైన శైలిలో సంప్రదాయానికి, పెద్దలకు ఇచ్చే గౌరవానికి అద్దం పట్టారు. బెంగాల్‌లో బీజేపీని బలోపేతం చేసిన పాతతరం నేతలలో ఒకరైన 98 ఏళ్ల మఖన్‌లాల్ సర్కార్‌ను ఈ వేదికపై ప్రత్యేకంగా సత్కరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ ఆయన పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం చూసి వేదికపై ఉన్నవారితో పాటు ప్రజలంతా హర్షధ్వానాలు చేశారు. మఖన్‌లాల్ సర్కార్ సామాన్య వ్యక్తి కాదు; 1952లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేపట్టిన కాశ్మీర్ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళిన నిఖార్సైన జాతీయవాది. అలాంటి యోధుడిని ప్రభుత్వం గౌరవించడం ద్వారా పాత తరం త్యాగాలను విస్మరించబోమని బీజేపీ చాటిచెప్పింది. ఇది కేవలం ఒక గౌరవం కాకుండా, బెంగాల్ ఆత్మగౌరవానికి దక్కిన గౌరవంగా పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే ముందు సువేందు అధికారి సోషల్ మీడియా వేదికగా బెంగాల్ ప్రజలకు ఒక భావోద్వేగ సందేశాన్ని ఇచ్చారు. 'సోనార్ బంగ్లా' (బంగారు బెంగాల్) కల ఇకపై నిజం కాబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న అవినీతి, అరాచక పాలన నుంచి బెంగాల్ విముక్తి పొందిందని, ఇకపై రాష్ట్రంలో అభివృద్ధి, శాంతి, సుసంపన్నతే లక్ష్యంగా తమ 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, రాష్ట్ర స్థాపకుల కలలను నెరవేర్చేందుకు తాము కట్టుబడి ఉంటామని సువేందు స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బెంగాల్‌ను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, సిటీ ఆఫ్ జాయ్‌గా పిలిచే కోల్‌కతా మళ్ళీ తన పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని ఆయన తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

2026 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేశాయి. మొత్తం 294 స్థానాలు ఉన్న అసెంబ్లీలో బీజేపీ ఒంటరిగానే 207 స్థానాలను కైవసం చేసుకుని స్పష్టమైన మెజారిటీ సాధించింది. గతంలో తిరుగులేని శక్తిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కేవలం 80 స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష హోదాకు పడిపోయింది. ముఖ్యంగా నందిగ్రామ్, భవానీపూర్ వంటి కీలక స్థానాల నుంచి పోటీ చేసిన సువేందు అధికారి, భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15 వేల ఓట్ల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించడం గమనార్హం. నందిగ్రామ్‌లో గతంలోనే మమతను ఓడించిన ఆయన, ఇప్పుడు మళ్ళీ ఆమె సొంత నియోజకవర్గంలోనే విజయం సాధించి తన సత్తా చాటారు. ఈ గెలుపు బెంగాల్ ప్రజలు మార్పును ఎంతగా కోరుకుంటున్నారో స్పష్టం చేస్తోంది. రాబోయే ఐదేళ్లలో బెంగాల్ రాజకీయ మరియు ఆర్థిక ముఖచిత్రం ఎలా మారుతుందో వేచి చూడాలి.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన సభల్లో 14,700 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, ఉచిత విద్యుత్ కోరుతూ వచ్చినవేనని పేర్కొన్నారు. తక్షణమే పరిష్కరించే వీలున్న వాటిని స్పాట్‌లోనే పూర్తి చేస్తున్నామని, మిగిలిన వాటిని మూడు నెలల గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా నిధులు జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

**ధరణి చిక్కుముడులకు 'భూ భారతి'**

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తప్పుల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి విమర్శించారు. ఒకే సర్వే నంబర్‌లోని కొంత భూమి సేకరణ జరిగితే.. మొత్తం నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టడం వంటి అవకతవకలను సరిదిద్దడానికే 'భూ భారతి' కార్యక్రమాన్ని తీసుకొచ్చామని వివరించారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు న్యాయం జరిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, వరితో పాటు మొక్కజొన్నను కూడా పూర్తి స్థాయిలో సేకరిస్తామని తెలిపారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ఇప్పటికే రూ.2 లక్షల లోపు రుణమాఫీని అమలు చేశామని చెప్పారు. గతంలో రైతులపై బేడీలు వేసిన వారు నేడు కొనుగోలు కేంద్రాల వద్ద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేశ్ రెడ్డి, బెల్లం శ్రీనివాస్,బోడ మంగీలాల్, కొప్పుల అశోక్, పోట్ల కిరణ్, కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడు దూదిమట్ల వెంకట్, అధికారులు ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఎమ్మార్వో లూథర్ విల్సన్, సర్పంచులు వనవాసం నరేందర్ రెడ్డి, ధరావత్ సుజాత, కర్నాటి రాజేంద్రప్రసాద్, చీమ్లా, నల్లమల్ల కీర్తి, జిల్లా స్థాయి అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వనగరంగా హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి**




మాస్టర్ ప్లాన్‌ను రూపొందించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ మాస్టర్ ప్లాన్ ద్వారా రాబోయే రెండు దశాబ్దాల్లో తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

హైదరాబాద్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం వినూత్నమైన మార్పులను శ్రీకారం చుట్టింది. నగరాన్ని 'ట్రాఫిక్ ఫ్రీ' మరియు 'సిగ్నల్ ఫ్రీ' సిటీగా మార్చేందుకు త్రీ లెవెల్ రవాణా విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు సీఎం తెలిపారు. ఇందులో భాగంగా అండర్ పాస్, సర్ఫేస్ (రోడ్డు మార్గం), మరియు ఎలివేటెడ్ కారిడార్లను సమన్వయం చేస్తూ ప్రయాణ సమయాన్ని తగ్గించనున్నారు. కేవలం రోడ్ల విస్తరణతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాదని గుర్తించిన ప్రభుత్వం, మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (బహుళ రవాణా వ్యవస్థ)ను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. అంతేకాకుండా, నగరంలో వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు వివిధ ప్రాంతాల్లో అత్యాధునిక మల్టీ లెవెల్ పార్కింగ్ సముదాయాలను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వివరించారు.

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణను మూడు విభిన్న మండలాలుగా విభజించినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. దీనిని 'క్యూర్ , ప్యూర్ , రేర్ ' అనే మూడు సూత్రాలతో అభివృద్ధి చేయనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 'క్యూర్' ఏరియాను ఐటీ మరియు ఇతర సేవా రంగాలకు (సర్వీస్ సెక్టార్) కేంద్రంగా గుర్తించారు. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉండే 'ప్యూర్' ఏరియాను ఉత్పత్తి రంగం (మాన్యుఫ్యాక్చరింగ్ సెక్టార్) కోసం కేటాయించారు. ఇక రీజనల్ రింగ్ రోడ్డుకు అవతల ఉండే 'రేర్' ఏరియాను పూర్తిస్థాయిలో వ్యవసాయ అనుబంధ రంగాల (అగ్రికల్చర్ సెక్టార్) అభివృద్ధికి వినియోగించనున్నారు. ఈ రకమైన వర్గీకరణ వల్ల పరిశ్రమలు, సేవలు మరియు వ్యవసాయం సమతుల్యంగా అభివృద్ధి చెందుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ మరియు నగరాభివృద్ధిలో భాగంగా మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మూసీ నదిని శుద్ధి చేయడమే కాకుండా, దాని పరిసరాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తూ, మన పూర్వీకుల సంస్కృతికి మరియు వారసత్వానికి అద్దం పట్టేలా తీర్చిదిద్దబోతున్నారు. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రజా రవాణా వ్యవస్థలో భారీ మార్పులు తెస్తున్నారు. ఆర్టీసీలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నారు. ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తిరుగుతున్న పాత ఆటోల వల్ల కలిగే కాలుష్యాన్ని అరికట్టేందుకు, వాటికి ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని సీఎం ప్రకటించారు. ఈ నిర్ణయాలు హైదరాబాద్‌ను ఒక పచ్చని, సురక్షితమైన మరియు అత్యాధునిక నగరంగా మారుస్తాయని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# హనీట్రాప్ వివాదంలో కేంద్ర మంత్రి కుమారుడు

**మొదటిపేజీ తరువాయి**



బండి భగీరథ్ ఒక భారీ హనీట్రాప్ వలలో చిక్కుకున్నారనే వార్త సంచలనం సృష్టిస్తోంది. తనను ఒక కుటుంబం ఉద్దేశపూర్వకంగా ట్రాప్ చేసి, అక్రమంగా డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తోందని భగీరథ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన ఒక యువతితో తనకు ఏర్పడిన స్నేహాన్ని అడ్డుపెట్టుకుని, ఆమె కుటుంబ సభ్యులు తనను మానసికంగా మరియు ఆర్థికంగా వేధిస్తున్నారని ఆయన తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా సదరు యువతి కుటుంబంతో కలిసి తాము పలు దేవాలయాలను సందర్శించామని, కుటుంబ వేడుకల్లో కూడా పాల్గొన్నామని, అయితే ఆ సాన్నిహిత్యాన్ని ఇప్పుడు వారు తమకు అనుకూలంగా మార్చుకుని బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారని భగీరథ్ ఆరోపించారు.

భగీరథ్ అందించిన సమాచారం ప్రకారం.. సదరు యువతిని వివాహం చేసుకోవాలని ఆమె కుటుంబ సభ్యులు తనపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారని, అందుకు తాను నిరాకరించడంతో అసలు కథ మొదలైందని తెలుస్తోంది. పెళ్లికి అంగీకరించకపోతే తన పరువు తీస్తామని, యువతితో కలిసి దిగిన ఫోటోలు, వీడియోలు మరియు సోషల్ మీడియాలో జరిగిన చాటింగ్‌లకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బహిర్గతం చేస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంతటితో ఆగకుండా, ఈ విషయాన్ని గోప్యంగా ఉంచాలంటే తమకు రూ. 5 కోట్ల భారీ మొత్తం చెల్లించాలని వారు డిమాండ్ చేసినట్లు భగీరథ్ తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. వారి బెదిరింపులకు భయపడిన తాను, ప్రాథమికంగా కొంత మొత్తాన్ని అంటే దాదాపు రూ. 50 వేల వరకు వారికి చెల్లించానని, కానీ వారి వేధింపులు మితిమీరిపోవడంతో పోలీసులను ఆశ్రయించక తప్పలేదని ఆయన వివరించారు.

అయితే ఈ నాటకీయ పరిణామాల్లో ఒక ఊహించని మలుపు చోటుచేసుకుంది. భగీరథ్ ఫిర్యాదు చేసిన కొద్ది సేపటికే, సదరు యువతి కుటుంబ సభ్యులు కూడా హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భగీరథ్ ఆరోపిస్తున్నట్లుగా అది హనీట్రాప్ కాదని, తమ కుమార్తె మైనర్ అని వారు వాదిస్తున్నారు. మైనర్ బాలికపై భగీరథ్ వేధింపులకు పాల్పడ్డారని, అందుకే ఆయనపై కఠినమైన పోక్సో (POCSO) చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ బిడ్డకు అన్యాయం జరిగిందని, రాజకీయ పలుకుబడితో భగీరథ్ తమనే నిందితులుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఒకవైపు హనీట్రాప్ ఆరోపణలు, మరోవైపు మైనర్ బాలిక వేధింపుల ఫిర్యాదుతో పోలీసులు ఇప్పుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండు వర్గాల వాదనలు విన్న తర్వాత, అసలు ఇందులో ఎవరు బాధితులు, ఎవరు నిందితులు అనే కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నారు.

ప్రస్తుతం ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కరీంనగర్ మరియు హైదరాబాద్ పోలీసులు రంగంలోకి దిగి విచారణను ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాలైన కాల్ డేటా రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు మరియు సోషల్ మీడియా చాటింగ్స్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. భగీరథ్ ఆరోపిస్తున్నట్లుగా అది పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హనీట్రాప్ అయితే, ఆ కుటుంబం గతంలో ఎవరినైనా ఇలాగే వేధించిందా అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు. అదే సమయంలో, యువతి వయస్సు నిరూపణకు సంబంధించిన పత్రాలను సేకరించి, ఆమె మైనరా కాదా అనే విషయాన్ని ధ్రువీకరించుకునే పనిలో పోలీసులు ఉన్నారు. కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో ఈ కేసుపై మీడియా మరియు ప్రజల దృష్టి నిరంతరం ఉండటంతో, పోలీసులు ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.

తెలంగాణ సమాజంలో ఇప్పుడు 'బండి భగీరథ్ బాధితుడా లేక నిందితుడా?' అనే అంశంపై చర్చలు సాగుతున్నాయి. రాజకీయంగా తన తండ్రికి ఉన్న ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ప్రత్యర్థులు ఎవరైనా ఇలాంటి కుట్రకు తెరలేపారా? లేక వ్యక్తిగత పరిచయాల వల్ల ఈ గొడవ తలెత్తిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్య ప్రజలు కూడా ఈ కేసులో నిజానిజాలు త్వరగా వెలికిరావాలని కోరుకుంటున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తి కుమారుడు కావడంతో చట్టం తన పని తాను సక్రమంగా చేస్తుందా లేదా అన్నది కూడా చర్చకు వస్తోంది. ఏది ఏమైనా, పోలీసుల తుది నివేదిక వచ్చే వరకు ఈ ఉత్కంఠ కొనసాగేలా కనిపిస్తోంది. మరికొద్ది రోజుల్లో ఈ సంచలన కేసులో మరిన్ని ఆధారాలు బయటపడే అవకాశం ఉంది, అప్పుడే ఈ మిస్టరీ వీడే అవకాశం కనిపిస్తోంది.

# విజయ్‌కు లైన్ క్లియర్

**మొదటిపేజీ తరువాయి**



అధికారికంగా తెలియజేశారు. ఈ నిర్ణయంతో టీవీకే సంఖ్యాబలం మరింత పెరిగి మొత్తం 118 స్థానాలకు చేరినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం వంటి పార్టీల మద్దతు కూడా టీవీకేకు ఉన్న విషయం తెలిసిందే.

**ఎన్నికల అనంతరం వేగంగా మారిన రాజకీయ పరిస్థితులు**

మే 4న జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. నటుడు విజయ్ నాయకత్వంలోని టీవీకే పార్టీ అతి పెద్ద రాజకీయ శక్తిగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ మార్క్‌ను సాధించలేక కొద్దిగా వెనుకబడింది. ప్రారంభంలో టీవీకేకు 107 స్థానాల బలం ఉన్నట్లు ప్రకటించగా, అనంతరం కాంగ్రెస్ (5), వామపక్షాలు (సీపీఐ, సీపీఎం కలిపి 4) మద్దతు ఇవ్వడంతో ఆ సంఖ్య కొంత పెరిగింది. తాజాగా వీసీకే మద్దతుతో ఆ సంఖ్య 118కి చేరినట్లు స్పష్టత వచ్చింది.

**వీసీకే నిర్ణయం రాజకీయంగా కీలకం**

వీసీకే పార్టీ తమిళనాడు రాజకీయాల్లో కీలక సామాజిక వర్గాల ప్రతినిధిగా గుర్తింపు పొందింది. దళిత, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే ఈ పార్టీ నిర్ణయం టీవీకేకు పెద్ద రాజకీయ బలాన్ని అందించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. తిరుమావళవన్ లేఖలో టీవీకే విధానాలు, ప్రజా సంక్షేమ దృక్పథం, కొత్త తరహా రాజకీయ మార్పు అవసరం వంటి అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టీవీకేకు మద్దతు ఇవ్వడం చరిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్నారు.

**విజయ్ నాయకత్వానికి పెరుగుతున్న మద్దతు**

సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్, తక్కువ కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా భారీ ప్రజాదరణ సంపాదించారు. రెండు స్థానాల్లో విజయం సాధించిన ఆయన నాయకత్వంపై ఇప్పుడు విస్తృత రాజకీయ మద్దతు కూడగడుతోంది. ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితుల్లో టీవీకే రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అత్యంత సమీపంలో ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే అధికారికంగా ప్రభుత్వ ఏర్పాటు ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు ప్రకటించగా, వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం కూడా అదే బాటలో నిలిచాయి. ఈ మద్దతులు టీవీకేకు రాజకీయంగా స్థిరత్వాన్ని తీసుకువచ్చాయి. ఇతర పార్టీల మద్దతు కూడా కొనసాగుతున్న నేపథ్యంలో టీవీకే రాష్ట్ర రాజకీయాల్లో కొత్త కూటమిగా ఎదుగుతోందని భావిస్తున్నారు. ముఖ్యంగా యువతలో విజయ్ ప్రభావం ఈ పరిణామాలకు ప్రధాన కారణంగా చెబుతున్నారు.

**మేజిక్ ఫిగర్ దిశగా టీవీకే ప్రయాణం**

తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ మార్క్‌కు టీవీకే ఇప్పటివరకు దగ్గరగా చేరుకుంది. వీసీకే మద్దతుతో 118 సంఖ్యకు చేరడంతో ఇప్పుడు అధికారికంగా ప్రభుత్వం ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కొన్ని కీలక రాజకీయ నిర్ణయాలు ఇంకా తీసుకోవాల్సి ఉండటంతో పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, టీవీకే ఏర్పాటుచేసే ప్రభుత్వం తమిళనాడు రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలికే అవకాశం ఉంది. సినీ గ్లామర్, యువత మద్దతు, సామాజిక సమీకరణాలు కలగలిపి కొత్త రాజకీయ సమీకరణాన్ని రూపొందిస్తున్నాయి. వీసీకే మద్దతు ఈ సమీకరణానికి మరింత బలాన్ని ఇచ్చిందని వారు చెబుతున్నారు. టీవీకే బలపడుతున్న నేపథ్యంలో ఇతర రాజకీయ పార్టీల వ్యూహాలు కూడా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి పార్టీల భవిష్యత్ చర్యలు కీలకంగా మారనున్నాయి. ప్రస్తుతం టీవీకే వైపు ఏర్పడుతున్న మద్దతు తరంగం రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా మార్చే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు. వీసీకే అధికారిక మద్దతుతో తమిళనాడు రాజకీయాల్లో నెలకొన్న ఉత్కంఠ మరింత తగ్గినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే దాదాపు సిద్ధమవుతున్న సంకేతాలు స్పష్టమవుతున్నాయి. అయితే అధికారిక ప్రకటన, తదుపరి రాజకీయ పరిణామాలు రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్ణయించనున్నాయి.

# ప్రధానికి కవిత బహిరంగ లేఖ!

**మొదటిపేజీ తరువాయి**



తీసుకువస్తున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు.

పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల నీటి పారుదల పథకానికి జాతీయహోదా కల్పించాలని కోరారు.

2027 జనాభా లెక్కలలో ప్రత్యేక ఓబీసీ కాలమ్‌ను చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

ఓబీసీ ఉప కోటాతో మహిళా రిజర్వేషన్ బిల్లును తిరిగి ప్రవేశపెట్టాలని కోరారు.

తెలంగాణలో వెనుకబడిన తరగతుల బిల్లులకు రాష్ట్రపతి ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని ఆ లేఖలో కోరారు.

జలభద్రత, డేటా ఆధారిత న్యాయం, లింగ సమానత్వం, రాజ్యాంగ రక్షణలు అనే నాలుగు మూలస్తంభాలను పరిష్కరించడం మన దేశ సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయడంలో ఎంతగానో దోహదపడుతుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. తాను సూచించిన అభ్యర్థనలపై సానుకూలంగా పరిశీలిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తుమ్మిడిహట్టి పేరుతో కాంగ్రెస్ కొత్త డ్రామా

**మొదటిపేజీ తరువాయి**

గ్రావిటీ ద్వారా నీళ్లు తెస్తామని మంత్రి జూపల్లి, 9:30 నుంచి సుందిళ్లకు నీళ్లు తెస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి, 9:30 నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తెస్తామని సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో ఎవరికి తోచిన విధంగా వారు మతి లేని మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 150 మీటర్లకు నాటి మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుంటే తుమ్మిడిహట్టి వద్ద కాకుండా ప్రాణహిత వద్ద పనులు ఎందుకు ప్రారంభించారని సూటిగా ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి వద్ద 150 మీటర్లకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి కిషన్ రెడ్డికి లేఖ రాస్తానడం హాస్యాస్పదం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి రాజకీయాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని అన్నారు. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ అన్నారు. తుమ్మిడిహట్టి సర్వే మొబిలైజేషన్ పేరిట రూ.2300 కోట్ల బిల్లులు ఎత్తిన ఘనత కాంగ్రెస్ నాయకులది అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తక్కువ చేసి మాట్లాడితే రాష్ట్రానికి ద్రోహం చేసినట్లే అన్నారు. కాళేశ్వరంలో కొలువై ఉన్న ముక్తేశ్వరుడు వారిని శిక్షిస్తాడని హెచ్చరించారు. మేడిగడ్డను రిపేరు చేసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీష్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా హోం మంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్ అయ్యారని హరీష్ రావు అన్నారు. కరీంనగర్ లో గోల్డ్ షాప్ లో దొంగతనం చేసిన దొంగలను పట్టుకోలేని, రాష్ట్ర రాజధానిలో ఓ ఐపీఎస్ అధికారి భార్య హత్య విషయంలో నిందితులను పట్టుకోలేరు కానీ బీఆర్ఎస్ నాయకత్వం పై రాజకీయ వేధింపులు మాత్రం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.



## కాప్రా మండల టాపర్లుగా కుషాయిగూడ విద్యార్థినులు

**కాప్రా, మే 9(ప్రజా క్షేత్రం):**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుషాయిగూడ విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. పాఠశాలలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన ఇద్దరు విద్యార్థినులు కాప్రా మండల టాపర్లుగా నిలిచారు.
జి. యశస్విని 560 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించగా, ఎం. సమన్విత 556 మార్కులతో మండల ద్వితీయ స్థానం దక్కించుకుంది. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాలలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణాదేవి మాట్లాడుతూ విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. ఉపాధ్యాయులు సుమలత, లక్ష్మయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, జానీ బేగం విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

**మద్దూర్ మే 09(ప్రజాక్షేత్రం):**



మద్దూర్ మున్సిపాలిటీ అప్పిరెడ్డిపల్లి బీటీ రోడ్డు పనులు జరుగుతుండగా రోడ్డుపై ట్రాక్టర్ గడ్డి కట్టలు మిషన్ వేసుకొని భూనేడుకు సంబంధించిన కావలి రాములు డ్రైవర్ ఉదయం సమయంలో తీసుకొని గ్రామానికి వెళుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృత్యుడు కుటుంబ సభ్యుల మేరకు మద్దూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ భాస్కర్ ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి డెడ్ బాడీని తరలించారు.

## మండల కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తాం

- **పి.మహిపాల్ రెడ్డి పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**

**పెద్దేముల్, మే 09(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ పార్టీ పెద్దేముల్ మండల అధ్యక్షులుగా నియమితులైన పి.మహిపాల్ రెడ్డిని రేగొండి గ్రామ సర్పంచ్ డి.అశోక్ తన అనుచర బృందంతో కలిసి శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించారు. తాండూరులో ఆయనను కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేగొండి గ్రామ సర్పంచ్ డి.అశోక్ మాట్లాడుతూ..... పి.మహిపాల్ రెడ్డి నాయకత్వంలో పెద్దేముల్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్ రెడ్డికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామని అన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీని మరింత చేరువ చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోనేరు మానేయ్య, ఎండి.మహమూద్, చైతన్య నగర్ మాజీ సర్పంచ్ ఆంజలయ్య, పి.బందెయ్య, టి.వెంకటయ్య, డి.చంద్రయ్య, టి.మహేష్, కే.భీమయ్య, డి.హన్మంతు, డి.రత్నం, కే.రవి తదితరులు పాల్గొన్నారు.



## కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

**వలిగొండ మే 09(ప్రజాక్షేత్రం):**

భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈనెల 8న జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఇప్పటి వరకు 2600 పైచిలుకు మంది అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఇప్పటికే 1800 మందికి స్క్రీనింగ్ నిర్వహించి టోకెన్ కేటాయింపు చేయడం జరిగింది. ఈ నెల 10 ఆదివారం వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిర్వహించే ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వయంగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ మెగా జాబ్ మేళా ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా కుంభం ఫౌండేషన్ కృషి చేస్తోందని కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి తెలిపారు.







## హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా

- **గోవింద నామస్మరణతో మారుమోగిన కీసర దాయరా**
- **భక్తజన సందోహంతో కళకళలాడిన హేమాద్రి దేవస్థానం**

**కీసర, మే 9(ప్రజా క్షేత్రం):**

కీసర దాయరాలో వెలసిన హేమాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి యంత్ర, విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. వేద పండితుల మంత్రోచ్చారణలు, గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.
టిటిడి ప్రధాన అర్చకులు పూజ్యశ్రీ వేణుగోపాల దీక్షితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి యంత్ర, విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. ప్రతిష్ట అనంతరం ప్రత్యేక మంగళహారతులు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.
సీఎం రేవంత్ రెడ్డి తరఫున సీఎం ముఖ్య సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, హిందూ ధర్మ ప్రచారకులు స్వామి రాధా మనోహర్ దాస్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్ రావు, మలిపెద్ది సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్, ములుగు డీసీసీ కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, అశోక్, ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి, కందాడి అంజి రెడ్డి తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.
ఆలయానికి చేరుకున్న అతిథులకు కమిటీ సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అతిథులందరూ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



మహోత్సవాన్ని పురస్కరించుకుని కీసర, నాగారం, కాప్రా, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తీర్థప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.
అనంతరం ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి అతిథులను శాలువాలతో సత్కరించి శ్రీవారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు, సేవలందించిన వాలంటీర్లకు, విచ్చేసిన అతిథులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా!

- **నాగారంలో అక్రమ నిర్మాణాల జోరు**
- **పట్టణ ప్రణాళిక నిబంధనలకు తూట్లు**
- **అధికారుల పర్యవేక్షణ లోపంతో యథేచ్ఛగా బహుళ అంతస్తులు**
- **నోటీసులతో సరిపెడుతున్నారా?.. స్థానికుల ఆగ్రహం**

**నాగారం, మే 9(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పట్టణ ప్రణాళిక నిబంధనలను పక్కనపెట్టి కొందరు నిర్మాణదారులు బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తుండగా, సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రహదారి పక్కన బాలాజీ మహేష్ మిఠాయి బండారు యజమాని చేపడుతున్న భవన నిర్మాణం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలల క్రితం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుండటంతో మున్సిపల్ అధికారులు భవన స్లాబ్ కు రంధ్రాలు పెట్టి పనులు నిలిపివేసినప్పటికీ, ప్రస్తుతం అదే భవనంపై మళ్లీ స్లాబ్‌లు వేసి నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వచ్చి నోటీసులు జారీ చేయడం తప్ప, నిర్మాణాన్ని పూర్తిగా అడ్డుకునే చర్యలు తీసుకోవడం లేదని వారు మండిపడుతున్నారు.

**సెట్‌బ్యాక్లు లేకుండానే నిర్మాణాలు**

నాగారం ప్రధాన రహదారితో పాటు అంతర్గత కాలనీలకు వెళ్లే మార్గాల్లో ఇప్పటికే ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో కనీస సెట్‌బ్యాక్లు కూడా వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రోడ్లకు ఆనుకుని భవనాలు నిర్మించడంతో ట్రాఫిక్ అంతరాయం పెరుగుతోందని, అత్యవసర సమయాల్లో అగ్నిమాపక వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ మార్గాలను ఆక్రమించడంతో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**అధికారుల కళ్లముందే ఉల్లంఘనలు**

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నా అధికారులు సమయానికి తనిఖీలు నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయం నాగారం డివిజన్‌కు దూరంగా ఉండటాన్ని కొందరు నిర్మాణదారులు అనుకూలంగా మార్చుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళల్లో వేగంగా స్లాబ్‌లు వేసి, అధికారులు వచ్చేలోపే పనులు పూర్తి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. "అధికారులు వచ్చి నోటీసులు ఇస్తారు.. వెళ్లిపోతారు.. ఆ తర్వాత మళ్లీ పనులు మొదలవుతాయి. కఠిన చర్యలు తీసుకోవాల్సిన వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు" అంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొందరు నిర్మాణదారులు రాజకీయ పలుకుబడితోనే నిబంధనలను ధిక్కరిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.







**ప్రజలకు పెరుగుతున్న ఇబ్బందులు**

అక్రమ నిర్మాణాల కారణంగా వెనుక వైపున ఉన్న కాలనీలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. రహదారుల వెడల్పు తగ్గిపోవడంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. నిర్మాణ వ్యర్థాలను రోడ్లపైనే వేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటూ డిమాండ్**

ఇప్పటికే పలు దినపత్రికల్లో అక్రమ నిర్మాణాలపై కథనాలు వెలువడినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న నిర్మాణదారులతో పాటు నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని నాగారం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మృతురాలు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**ఖానాపురం మే 09(ప్రజాక్షేత్రం):**

ఖనాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెడిపాక రామస్వామి కూతురు బుధరావుపేట కాంగ్రెస్ పార్టీ 1వ వార్డ్ మెంబర్ గారే అనుష కొద్ది రోజులక్రితం అకాల మృతి చెందినారు ఈరోజు వారి చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించిన మృతురాలి భర్త గారే రవికుమార్ కూతురు ఉష్రీని కుమారుడు ఘన ఉన్నారు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి వారి కుటుంబానికి అండగా ఉంటానని అదేరపడద్దని పార్టీ మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ వైస్ చైర్మన్ &ఖానాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాఖమూరి హరిబాబు మరియు బుధరావుపేట సర్పంచ్ పెసరు రాణి గోవర్ధన్ రెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షులు లింగిడి వెంకటేశ్వర్లు ఖానాపురం కిసాన్ సెల్ అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్ రాష్ట్రయూత్ జనరల్ సెక్రెటరీ మోడల్ మెల్ల గౌడ్ షేక్ చాంద్ బాషా గుండు సాంబయ్య చెడిపాక యాకయ్య చెడిపాక వినోద్ జీడి హరీష్ పార్టీ నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పెద్ద కొడప్‌గల్ లో రైతులకు అవగాహన కార్యక్రమం

- **రైతులు పరీక్షలు చేయించుకోవాలి ఏవో కిషన్**

**పెద్ద కొడప్‌గల్, మే 09(ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రంలో రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కిషన్ సూచించారు. శనివారం రైతు వేదికలో నిర్వహించిన ప్రజాపాలన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భూమి సారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా ఎరువులు వినియోగిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడరాదని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






# గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి

**వలిగొండ మే 09(ప్రజాక్షేత్రం):**

దేశంలో రాష్ట్రాలకు ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించాల్సిన గవర్నర్లు కేంద్ర ప్రభుత్వానికి ఏజెంట్లుగా మారుతున్నారని, వెంటనే గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి. జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం వలిగొండ మండలం నాగారం గ్రామంలో జరిగిన యాదాద్రి భువనగిరి జిల్లా ముఖ్య నాయకత్వ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గవర్నర్లు ప్రతిపక్ష ప్రభుత్వాలను వేధించడం, రాష్ట్రాల హక్కులను అడ్డుకోవడం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు తమిళనాడులో ప్రజలు మెజార్టీతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని గవర్నర్ వ్యవహార శైలి ద్వారా ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. బలనిరూపణ శాసనసభలో జరగాల్సిందే తప్ప రాజభవన్లో కాదని స్పష్టం చేశారు. కేరళ, తమిళనాడు, బెంగాల్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో గవర్నర్ల వ్యవహార శైలి ప్రజాస్వామ్యానికి ఆటంకంగా మారిందని, అందువల్ల గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, జిల్లా నాయకులు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

**వలిగొండ మే 09(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన చిత్రకంటి నరేష్ భార్య అయిన ఎడవెల్లి వాణి కి ఒక లక్ష రూపాయలు చెక్ గ్రామ సర్పంచ్ చమడాల అనిత నర్సింగ్ యాదవ్, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉక్కుర్తి స్వామి మరియు ఉపసర్పంచ్ బూడిద నాగరాజు, వార్డు మెంబర్లు బూడిద స్వామి, పోలేపల్లి ప్రభాకర్, ఉక్కుర్తి పద్మ నరసింహ, నిమ్మల వెంకటేశం, ఎడవల్లి పోచమ్మ రమేష్, మాజీ ఎంపీటీసీ ఎడవల్లి సత్తమ్మ యాదయ్య, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గంజి అశోక్, ఎడవెల్లి నరేష్, ఎడవల్లి గోపయ్య తదితరులు పాల్గొని బాధితులకు చెక్కుఅందజేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.



## సంత్ సేవాలాల్ బంజారా కార్పొరేషన్‌కు వెంటనే చైర్మన్, వైస్ చైర్మన్ లను నియమించాలి

**వనపర్తి, మే 09(ప్రజాక్షేత్రం)**



తెలంగాణ ప్రభుత్వం పలు కార్పొరేషన్లకు చైర్మన్, వైస్ చైర్మన్‌లను నియమిస్తూ జీఓఆర్టీ నెం.601 విడుదల చేయడం స్వాగతించదగ్గ విషయమేనని, అయితే సంత్ సేవాలాల్ బంజారా కార్పొరేషన్‌పై మాత్రం స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమని బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్ అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రాహ్మణ, వడ్డెర, మున్నూరుకాపు, యాదవ, వాల్మీకి బోయ కార్పొరేషన్లకు నియామకాలు చేపట్టిన ప్రభుత్వం, బంజారా సమాజాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. బంజారా యువత, మహిళలు, నిరుద్యోగులకు సేవాలాల్ కార్పొరేషన్ కీలకమని పేర్కొన్నారు. వెంటనే కార్పొరేషన్‌కు చైర్మన్, వైస్ చైర్మన్‌లను నియమించి, తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## కాటేసిన పాములు.. బాలుడు మృతి

**హన్మకొండ మే 09(ప్రజాక్షేత్రం):**



ముండిచింత తండాలో విషాదం నెలకొన్నది. దేవరుప్పుల మండలం ధర్మాపురం సమీపంలోని ముండిచింత తండా (లక్ష్మణ్ తండా)లో విషాదకర ఘటన చోటుచేసుకున్నది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు పాముల కాటుకు గురై కళ్లముందే ప్రాణాలు కోల్పోవడంతో ఆ తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.లక్ష్మణ్ తండాకు చెందిన శ్రీయన్ (4) అనే బాలుడు గురువారం అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో నిద్రలో ఉండగా ఒకే సమయంలో నాగుపాము, రక్తపింజరలు కాటువేసాయి. అయితే ఆ బాలుడు భయంతో తల్లిదండ్రులకు కాటువేసిన విషయం చెప్పలేదు. సుమారు గంట తర్వాత, అంటే తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో తనను పాములు కరిచాయని బాలుడు చెప్పడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు హుటాహుటిన బాలుడిని హన్మకొండలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ అప్పటికే బాలుడి శరీరం అంతటా విషం పాకింది. పరిస్థితి విషమించిన బాలుడు శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందాడు. కళ్లముందే కొడుకు శవమై పడి ఉండటంతో తల్లిదండ్రుల రోధనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. బాలుడి తల్లి కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# బౌరంపేట్‌లో పారిశుద్ధ్యంపై డిప్యూటీ కమిషనర్ ప్రత్యేక సమీక్ష

- ఈ-వేస్ట్ నిర్వహణపై ప్రజలకు అవగాహన
- - "నో బిన్ – నో లైసెన్స్" విధానంపై హెచ్చరిక

**కుత్బుల్లాపూర్ మే 09(ప్రజాక్షేత్రం):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ వార్డులో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాండ్‌మార్క్3 ప్రాంతంలో ఈవేస్ట్ అవగాహన మరియు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సురక్షితంగా పారవేయడం, సరైన వ్యర్థాల నిర్వహణ ద్వారా పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కమర్షియల్ షాపులు, హోటళ్ల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై "నో బిన్ - నో లైసెన్స్" విధానాన్ని అమలు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఇంటి నుండి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలుకు అందించాలని ప్రజలకు సూచించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచడం, రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం, చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్డు పక్కన పేరుకుపోయిన నిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాలను (సి&డి వ్యర్థాలు) వెంటనే తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పి. సాత్విక్, ఎస్ఎఫ్ఏలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.






## సేవా భావాన్ని చాటుకున్న డాక్టర్ సంపత్ కుమార్

- మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**పెద్దేముల్, మే 09(ప్రజాక్షేత్రం):**

తాండూరు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సంపత్ కుమార్ మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు.సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే ఆయన, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. పెద్దేముల్ మండలం హన్మాపూర్ గ్రామానికి చెందిన పాపయ్య శనివారం మృతి చెందగా, వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న డాక్టర్ సంపత్ కుమార్ మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు డాక్టర్ సంపత్ కుమార్ సేవా దృక్పథాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో హన్మాపూర్ సర్పంచ్ లొంక రాములు, మృతుడి కుమారుడు రాములు, యువకులు పంజుగుల రవి, బక్కని విజయ్, పసుల వెంకటేష్, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.



## స్వీయ గణనకు ప్రజలు ముందుకు రావాలి

- జనగణన-2027పై అవగాహన మారథాన్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపు

**వనపర్తి, మే 09(ప్రజాక్షేత్రం):**

జనగణన2027లో భాగంగా ప్రభుత్వం కల్పించిన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం జనగణన2027పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన మారథాన్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన మారథాన్ పాలిటెక్నిక్ కళాశాల వరకు సాగింది. విద్యార్థులు, యువత, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జనగణన ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కరోనా కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డిజిటల్ విధానంలో జనగణన చేపడుతున్నట్లు తెలిపారు. మే 11 నుంచి జూన్ 10 వరకు జిల్లాలో సుమారు 13 వేల మంది సిబ్బంది ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ కార్యక్రమం నిర్వహించి వివరాలు సేకరిస్తారని చెప్పారు. ప్రజలు స్వీయ గణన ద్వారా తమ వివరాలను తామే నమోదు చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. సరైన సమాచారం ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ప్రజల నుంచి సేకరించే వివరాలు ఎటువంటి పథకాల నమోదులోనూ వినియోగించబోమని స్పష్టం చేశారు. అందువల్ల ఎవరూ అపోహలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఎన్యూమరేటర్లకు సమాచారాన్ని అందించాలని కోరారు. జనగణన విజయవంతానికి మీడియా కీలక పాత్ర పోషించాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలందరూ సహకరించి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, సీపీఓ హరికృష్ణ, డీవైఎస్‌వో సుధీర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.







## ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పై కేసు

# రాజకీయ ప్రతికారమే

- టీపీసీసీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్.
- బీఆర్ఎస్ నేతలే పోలీసులపై దాడులకు పాల్పడ్డారంటూ ఆరోపణలు.

**పెద్దేముల్, మే 09(ప్రజాక్షేత్రం):**

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్‌పై నమోదైన కేసు పూర్తిగా రాజకీయ ప్రతీకార చర్యేనని టీపీసీసీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్ ఆరోపించారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతోనే నిరాధార ఆరోపణల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని రియాజ్ మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో జరిగిన ఘటనలను ప్రజలు మరచిపోలేదని, ఆ సమయంలో బీఆర్ఎస్ నాయకులే పోలీసులపై తోపులాటకు దిగారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు అరాచకాలకు పాల్పడ్డాయని, స్వయంగా ఎమ్మెల్యేపై దాడి చేసేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఇప్పుడు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్‌లపై ఎదురు కేసులు నమోదు చేయిస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ప్రజాదరణ కోల్పోతున్నామనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు ఇలాంటి రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని రియాజ్ ఆరోపించారు. నిజాయితీగా ప్రజాసేవ చేస్తున్న మనోహర్ రెడ్డి వంటి నాయకులపై తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తాండూరు ప్రజలు బద్నాం రాజకీయాలను ఎప్పటికీ నమ్మరని, వాస్తవాలు ప్రజలకు తెలుసని టీపీసీసీ మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్ స్పష్టం చేశారు.

## దుండిగల్‌లో నైట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ దూకుడు

- రాత్రివేళ చెత్త పారబోస్తే ఇక జరిమానాలే
- స్వచ్ఛ ఆటోకే చెత్త ఇవ్వాలి... లేకపోతే ఫైన్

**కుత్బుల్లాపూర్ మే 09(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలో ప్రజా పరిశుభ్రతను పరిరక్షించేందుకు సీఎంసీ అధికారులు ప్రత్యేక నైట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ బృందం రాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశాలు, రోడ్డు పక్కలు, ఖాళీ స్థలాల్లో అక్రమంగా చెత్త వేస్తున్న వారిపై నిఘా పెట్టి చర్యలు చేపడుతోంది. తాజా తనిఖీల్లో చెత్తను అనధికారికంగా పారబోసిన పలువురు వ్యక్తులను గుర్తించిన అధికారులు వారికి జరిమానాలు విధించారు. అలాగే నిబంధనలు ఉల్లంఘిస్తూ చెత్త వేస్తున్న కొంతమందిని పట్టుకుని దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇంటి చెత్తను తప్పనిసరిగా స్వచ్ఛ ఆటోకే అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. పరిశుభ్రమైన దుండిగల్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.




## ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు లేక ఇబ్బంది పడుతున్న రోగులు

**వలిగొండ మే 09(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో వేములకొండ గ్రామానికి చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగి ఆరు నెలలు గడిచి చిన్న రూములో అరకొర వైద్యంతో ఇబ్బంది పడుతున్న రోగులు ఇంతవరకు ఎమర్జెన్సీ గ్లూకోస్ ఇవ్వడానికి బెడ్స్ వసతిలేని పరిస్థితి వెంటనే సంబంధిత కలెక్టర్, డి ఎం హెచ్ ఓ. సంబంధిత అధికారులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు వసతులు కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు.






# మల్కాపూర్‌లో ఉత్సాహంగా ప్రారంభమైన హాంకాంగ్ క్రికెట్ టోర్నమెంట్

- **ప్రారంభించిన సిఐ సుమన్**
- **హాజరైన మల్కాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్**
- **అద్భుతమైన ఏర్పాట్లు చేసిన ఎకెఎస్ సంస్థ**

**కొండాపూర్, మే 09(ప్రజాక్షేత్రం):**

మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో క్రీడా ఉత్సాహం వెల్లివిరిసింది. గ్రామంలోని యువతను ప్రోత్సహించే లక్ష్యంతో ఎకెఎస్ సంస్థ నిర్వహించ తలపెట్టిన హాంకాంగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ప్రారంభమైంది.

**క్రికెట్ ఆడిన కొండాపూర్ సీఐ**

టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించిన సీఐ మాట్లాడుతూ. గ్రామీణ స్థాయి నుండే ప్రతిభావంతులైన ఆటగాళ్లు జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసిపోయి కాసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు.

**దాతృత్వానికి నిదర్శనం**

ఈ మెగా టోర్నమెంట్ విజయవంతం కావడంలో ఏకెఎస్ కాంట్రాక్టర్ అనిల్ కుమార్ గారి పాత్ర ప్రశంసనీయం. క్రీడల పట్ల ఉన్న మక్కువతో, యువతకు అండగా నిలుస్తూ ఆయన అందించిన ఆర్థిక సహకారం మరియు స్పాన్సర్‌షిప్ పట్ల గ్రామస్తులు మరియు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఉదారతకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**క్రీడా స్ఫూర్తిని చాటాలి.**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ అనిల్ మాట్లాడుతూ క్రీడలకు సంబదించిన ఎటువంటి ప్రోత్సాహానికైనా పంచాయతీ ముందుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా తను ఒకప్పుడు కబడ్డీ బాగా ఆడే వాన్నన్ని గుర్తుచేసుకున్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఉపసర్పంచ్ ప్రవీణ్ సూచించారు. గ్రామీణ స్థాయిలోని ప్రతిభావంతులైన ఆటగాళ్లకు ఇది గొప్ప అవకాశం అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తన మిత్రుడు స్పాన్సర్ అనిల్ ను ప్రశంసించారు. ఈ భారీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఆర్గనైజింగ్ టీమ్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు

**నిర్వాహక బృందం కృషి...**

టోర్నమెంట్ ఏర్పాట్లను అత్యంత క్రమశిక్షణతో నిర్వహించిన ఫుర్కాన్, అజ్జు, తస్లీమ్ మరియు వారి బృందాన్ని అందరూ అభినందిస్తున్నారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మైదానాన్ని సిద్ధం చేయడంలో, మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌లో ఈ టీమ్ చూపిన చొరవ అద్భుతమని అతిథులు కొనియాడారు. ఈ టోర్నమెంట్‌లో సంగారెడ్డి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 48 జట్లు తలపడుతున్నాయి. విజేతలకు భారీ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అజగర్, లక్ష్మణ్, దశరథ్, రత్నం, నరేష్, క్రీడాభిమానులు మరియు పెద్ద సంఖ్యలో యువత పాల్గొని ఆటగాళ్లను ప్రోత్సహించారు.



# గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

- **ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
- **సర్పంచ్ మాడి రాజేందర్ రెడ్డి**

**మొయినాబాద్, మే 09(ప్రజాక్షేత్రం):**

ఖాసీంబౌలి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని సర్పంచ్ మాడి రాజేందర్ రెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలో హెచ్‌ఎండీఏ నిధులతో మంజూరైన సి.సి. రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్థానిక పాలకవర్గంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఖాసీంబౌలిని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధిలో ప్రజలు చురుగ్గా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ పాలకవర్గం దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమ నరేష్ యాదవ్, గ్రామస్తులు చాకలి వెంకటయ్య, మాడి వీరేందర్ రెడ్డి, బి. మల్లేష్ యాదవ్, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.







# ఎండ దెబ్బ.. వాన బెడద రైతన్నల ఆందోళన

- **కొనుగోలు కేంద్రల్లో తడుస్తున్న ధాన్యం...**

**కరీంనగర్, మే 09(ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ జిల్లాలో వాతావరణం రోజురోజుకు రైతులను కలవరపెడుతోంది. పగటిపూట భానుడు భగభగమంటూ మండిపోతుండగా.. సాయంత్రం వేళ ఈదురుగాలులతో కూడిన అకాల జల్లులు కురుస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తరలింపులో జాప్యం కారణంగా రైతన్న ఆందోళన చెందుతున్నాడు.

వరి కోతలు పూర్తి చేసి ఆశలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు.. రోజుల తరబడి కేంద్రాల వద్దే కాపలా కాస్తున్నారు. కొన్ని చోట్ల 15 నుంచి 20 రోజులుగా ధాన్యం నిల్వలు పేరుకుపోయినా మిల్లులకు తరలింపు జరగకపోవడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**టార్పాలిన్లతో ధాన్యానికి కాపలా**

అకాల వర్షాల ముప్పుతో రైతులు రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే గడుపుతున్నారు. ఎప్పుడెప్పుడు వాన కురుస్తుందోనన్న భయంతో టార్పాలిన్లు కప్పి ధాన్యాన్ని కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు. అయితే పలుచోట్ల సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం తడిసిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈదురుగాలుల కారణంగా కప్పిన తార్పాలిన్లు ఎగిరిపోతుండటంతో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

**తడిసిన ధాన్యంపై తగ్గుతున్న నాణ్యత**

కొన్ని ప్రాంతాల్లో కురిసిన జల్లులతో ధాన్యం తడవడంతో నాణ్యత తగ్గే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. తేమ శాతం పెరిగితే కొనుగోలు ప్రక్రియలో సమస్యలు వస్తాయని, మద్దతు ధర కూడా దక్కకపోవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెట్టుబడుల భారంతో సతమతమవుతున్న తమకు అకాల వర్షాలు మరింత నష్టాన్ని మిగులుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**వెంటనే తరలింపులు చేపట్టాలి**

కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని రైతులు, రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. వాతావరణ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి ధాన్యం తడవకుండా రక్షించాలని కోరుతున్నారు. మరోవైపు అధికారులు మాత్రం మిల్లర్ల సమన్వయంతో వేగంగా తరలింపులు చేపడుతున్నామని చెబుతున్నారు.

# బ్రతుకు దెరువు డబ్బా ధ్వంసం... జీవనోపాధి కోల్పోయామని బాధితురాలి ఆవేదన

- **జనగాం గ్రామ పంచాయతీపై చాకలి భాగ్యమ్మ ఆరోపణలు**
- **గ్రామ పంచాయతీ చట్టం, నియమ నిబంధనల ప్రకారమే డబ్బాలను తొలగించాం- జనగాం గ్రామ సర్పంచ్**
- **గ్రామ పంచాయతీ చట్టం ప్రకారమే 3 నోటీసుల తరువాతనే డబ్బాలను తొలగించాం- పంచాయతీ కార్యదర్శి**
- **డబ్బాలు వేసుకొన్న స్థలం పూర్తిగా ప్రభుత్వ స్థలం- గ్రామ పంచాయతీ కార్యదర్శి**
- **న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధితురాలు చాకలి భాగ్యమ్మ**

**పెద్దేముల్, మే 09(ప్రజాక్షేత్రం):**

బ్రతుకు దెరువు కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న డబ్బాను గ్రామ పంచాయతీ అధికారులు జేసీబీ సహాయంతో పూర్తిగా ధ్వంసం చేశారని, దీంతో జీవనోపాధి కోల్పోయామని బాధితురాలు చాకలి భాగ్యమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలంలోని జనగాం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి జనగాం గ్రామానికి చెందిన బాధితురాలు చాకలి భాగ్యమ్మ తెలిపిన వివరాల ప్రకారం.... పెద్దేముల్ మండల పరిధిలోని జనగాం గ్రామంలో చాకలి భాగ్యమ్మ,ఆమె భర్త చాకలి నర్సింహులు కలిసి 2019లో సుమారు 7 సంవత్సరాల క్రితం గ్రామంలో ల్యాండ్రి షాపుతోపాటు కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు.అయితే ఇటీవల కొన్ని నెలల క్రితం జనగాం గ్రామాన్ని అప్పటి వికారాబాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్ సందర్శించారు. ఆ సమయంలో కొందరు గ్రామస్తులు అప్పటి అదనపు కలెక్టర్ సుధీర్ కు పాఠశాల సమీపంలో, మిషన్ భగీరథ నీటి ట్యాంకు వద్ద ఉన్న డబ్బాల కారణంగా మద్యం సేవించడం, చెత్త చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయడం జరుగుతోందని,దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.అందుకు సంబంధించి అదనపు కలెక్టర్ స్పందిస్తూ పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆ డబ్బాలను గ్రామ పంచాయతీ నియమనిబంధనలు,చట్ట ప్రకారం చర్యలు తీసుకొని డబ్బాలను అక్కడి నుండి తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అందులో భాగంగా గ్రామ పంచాయతీ అధికారులు అప్పట్లో చాకలి భాగ్యమ్మ దుకాణం డబ్బాకు సంబంధించి ఆమె భర్త చాకలి నర్సింహులు పేరుతో ఫిబ్రవరి 19,2026 నాడు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం సెక్షన్ 96 మరియు జీవోఎంఎస్ నెం.550 ప్రకారం పంచాయతీ రాజ్ మరియు గ్రామాభివృద్ధి శాఖ తేది: 03/12/1999 ప్రకారం ఏ వ్యక్తి కూడా గ్రామపంచాయతీ స్థలమును తదితర ప్రాంతాలను ఆక్రమించ కూడాదని నిర్దేశిస్తూ ఫారం02 ద్వారా మొదటి నోటీసును జారీ చేశారు. అనంతరం తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018లోని సెక్షన్ 113 మరియు 114 జీవోఎంఎస్ నెం.67 (పీఆర్అండ్ఆర్డీ) ప్రకారం మార్చి 26,2026 నాడు రెండవ నోటీసును, మార్చి 31,2026 నాడు మూడవ నోటీసును ఇలా మొత్తం 3 నోటీసులను జారీ చేశారు. అయితే తమ కుటుంబానికి మా నాన్న చాకలి ఎల్లప్ప పేరుమీద అప్పట్లో ప్రభుత్వం 1997లో ఫారండి, ఫైల్ నెం, బి/413/1997 ద్వారా జనగాం గ్రామంలో స్థలం కేటాయించిందని, ఆ స్థలంలోనే జీవనోపాధి కోసం కులవృత్తి ల్యాండ్రి మరియు కిరాణ షాపును 2019 సంవత్సరంలో ప్రారంభించి జీవనం కొనసాగిస్తున్నామని చాకలి భాగ్యమ్మ కుటుంబం పేర్కొంది. ఈ మధ్య నూతనంగా ఏర్పడిన జనగాం గ్రామ పంచాయతీ పాలకవర్గం వారు అట్టి స్థలమును అక్రమంగా ఆక్రమించారని తెలియజేస్తూ నోటీసులు జారీ చేశారని వివరిస్తూ ఇందుకు సంబంధించిన పత్రాలు, పంచాయతీ ట్యాక్స్ రసీదులు కూడా తమ వద్ద ఉన్నాయని చెబుతూ పెద్దేముల్ మండల ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఇదే ఫిర్యాదును గ్రామ పంచాయతీ కారోబార్ కు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల గ్రామ పంచాయతీ అధికారులు జనగాం గ్రామంలో బాధితురాలు చాకలి భాగ్యమ్మకు సంబంధించిన ల్యాండ్రి మరియు కిరాణ షాపును జేసీబీ సహాయంతో పూర్తిగా డబ్బాను ధ్వంసం చేసి అక్కడి నుండి తొలగించారు. ఇదే విషయమై చాకలి భాగ్యమ్మ శనివారం మీడియా ముందు తన గోడును వెల్లబోసుకుంటూ...జనగాం గ్రామంలో సుమారు 7 సంవత్సరాల నుండి బ్రతుకుదెరువు కోసం ల్యాండ్రి మరియు కిరాణ దుకాణం పెట్టుకున్నామని, దుకాణానికి సంబంధించి గ్రామ పంచాయతీలో ట్రేడ్ లైసెన్సు పొంది లైసెన్సు ఫీజులు కూడా కట్టుకున్నామని వాపోయారు. మేము పెళ్ళికి వెళ్ళింది చూసి మాకు చెప్పకుండా మా దుకాణం డబ్బాను పూర్తిగా జేసీబీ సహాయంతో ధ్వంసం చేసి కూల్చివేశారని ఆరోపించారు. తాము జనగాం గ్రామ పంచాయతీ పరిధిలో ఏ స్థలాన్ని ఆక్రమించలేదని, ఎక్కడ కూడా అక్రమించి ఇండ్ల నిర్మాణాలు, అక్రమంగా కట్టడాలు కట్టలేదని కేవలం బ్రతుకు దెరువు కోసమే డబ్బాను పెట్టుకున్నామని అన్నారు.డబ్బా తొలగింపు సమయంలో డబ్బాలో ఉన్న సామాగ్రి ధ్వంసమైందని, టెంట్ హౌజ్ కు సంబంధించిన రూ.1 లక్ష 50 వేల నగదును కూడా కనిపించకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు ముందుగా సమాచారం ఇచ్చి ఉంటే మేమే డబ్బాను తొలగించేవాళ్ళం, కానీ ఏలాంటి అవకాశం ఇవ్వకుండా పూర్తిగా పీకేసీ సామాన్లన్నీ బజార్లో పడేశారని ఆరోపిస్తూ వాపోయారు. గ్రామ పంచాయతీలో ట్రేడ్ లైసెన్సు తీసుకుని ఫీజులు కూడా చెల్లిస్తున్నామని అయినా అన్యాయంగా వ్యహరించారంటూ చాకలి భాగ్యమ్మ మీడియా ముందు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనపై ఈ నెల 6న పెద్దేముల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ స్పందించలేదని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని బాధితురాలు వేడుకున్నారు. ప్రస్తుతం జీవనోపాధి కోల్పోయి మా కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.





**జనగాం గ్రామ పంచాయతీ కార్యదర్శి వివరణ**

నేను జనగాం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరి సుమారుగా 1 నెల మాత్రమే అయిందని, గతంలో ఉన్న పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ నియమనిబంధనల ప్రకారం డబ్బాలను కొనసాగిస్తున్నవారికి 3 నోటీసులు జారీ చేయడం జరిగిందని అన్నారు. గ్రామ సర్పంచ్ నోటీసులు ఇచ్చిన తరువాత కూడా డబ్బాల యజమానులకు చాలా సమయం ఇచ్చారు. అయినా వాళ్ళు డబ్బాలను తీయలేదు. వారు డబ్బాలను పెట్టుకొన్న స్థలం పూర్తిగా ప్రభుత్వ స్థలం (భూమి), కాబట్టి పోలీసుల సాయంతో సర్పంచ్ సమక్షంలో తాము డబ్బాలను గ్రామ పంచాయతీ చట్టం ప్రకారమే తొలగించామని వివరణలో పేర్కొన్నారు.

**జనగాం గ్రామ సర్పంచ్ వివరణ**

గతంలో ఉన్న వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు జనగాం గ్రామంలో స్కూల్, మిషన్ భగీరథ ట్యాంక్ పరిసరాల్లో ఉన్న డబ్బాలు కొనసాగిస్తున్న యజమానులకు 3 నోటీసులు జారీ చేయడం జరిగిందని,వారికి డబ్బాలు తీసివేయడానికి కూడా సమయం ఇచ్చామని అన్నారు. గ్రామ పంచాయతీ చట్ట ప్రకారం 3 నోటీసులను కూడా ఇచ్చామని అన్నారు.సుమారు 20 రోజుల క్రితం డబ్బాల యజమానులకు డబ్బాలలోని సామాన్లు తొలగించాలని,డబ్బాలను అక్కడి నుండి తొలగించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా,అదే విధంగా తానే స్వయంగా ఇంటికి పిలిపించి చెప్పడం జరిగిందని, రూల్ ప్రకారం నోటీసులు జారీ చేశాక తీసేయాలని,కానీ వాళ్లు తీసేయలేదని అన్నారు.మరోమారు వారం రోజుల క్రితం మాట్లాడి గత సోమవారం ఉదయం 10 గంటల వరకు డబ్బాలను,డబ్బాలలో ఉన్న సామాన్లను తొలగించాలని ఇద్దరు యజమానులకు చెప్పడం జరిగిందని,చాకలి నర్సింహులు ఇంటికి గ్రామ పంచాయతీ వర్కర్లను పంపించి ఈ విషయాన్ని తెలియజేయడం జరిగిందని అన్నారు.దానికి వాళ్ళు డబ్బాలను తొలగించకపోవడంతో గ్రామ పంచాయతీ చట్ట ప్రకారం, రూల్ ప్రకారం, పూర్తి స్థాయి గ్రామ పంచాయతీ నియమ నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకొని డబ్బాలను తొలగించడం జరిగిందని జనగాం గ్రామ సర్పంచ్ వివరణలో పేర్కొన్నారు.



## తాండూరులో ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి

- **నివాళులర్పించిన ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి**

**తాండూరు, మే 09(ప్రజాక్షేత్రం):**

మాతృభూమి విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి, అన్యాయంపై అలుపెరగని పోరాటం చేసిన వీర యోధుడు మహారాణా ప్రతాప్ అని ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలో ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహారాణా ప్రతాప్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ.. మహారాణా ప్రతాప్ ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కష్టకాలంలో కూడా ఆత్మగౌరవాన్ని వదులుకోకుండా పోరాడిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మున్సిపల్ చైర్మన్ నీరజా బాల్రెడ్డి, తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రత్ పటేల్, పలువురు ప్రముఖులు, యువకులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీర యోధుడికి స్మరించుకున్నారు.



## నేతలపై అభిమానానికి నిలువెత్తు నిదర్శనం..

- **ఛాతిపై చంద్రబాబు-లోకేష్ పచ్చబొట్టు!**

**వనపర్తి, మే 09(ప్రజాక్షేత్రం):**

రాజకీయ నాయకులపై అభిమానాన్ని వివిధ రూపాల్లో వ్యక్తపరచడం సహజం. అయితే కొందరు కార్యకర్తలు తమ అభిమానాన్ని జీవితాంతం నిలిచిపోయేలా గుర్తుగా మలుచుకుంటారు. అలాంటి అరుదైన సంఘటనే వనపర్తి నియోజకవర్గంలోని ఖిల్లా ఘనపురం మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఖిల్లా ఘనపురం మాజీ ఉపసర్పంచ్ గా పనిచేశారు. తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పని చేస్తున్న సామాన్య కార్యకర్తగా గుర్తింపు పొందిన ఆయన, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పై తనకున్న అపారమైన అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నారు. తన ఎదపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చిత్రాలతో పాటు తెలుగుదేశం పార్టీ గుర్తును పచ్చబొట్టుగా వేయించుకుని పార్టీ పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పార్టీ కార్యకర్తలు, అభిమానులు యాదయ్య తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తూ ఆయన అభిమానానికి ఫిదా అవుతున్నారు. "చంద్రబాబు నాయకత్వం రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకం.. నారా లోకేష్ యువతకు స్ఫూర్తి" అని యాదయ్య పేర్కొన్నారు. తాను చిన్నప్పటి నుంచే తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను అభిమానిస్తున్నానని, పార్టీ కోసం చివరి వరకూ పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు,టిటిడి మాజీ బోర్డు సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు యాదయ్యను ప్రత్యేకంగా అభినందించారు. "సామాన్య కార్యకర్తగా ఉండి కూడా పార్టీపై ఇంతటి అభిమానాన్ని చూపించడం అభినందనీయం. యాదయ్యలాంటి కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన బలం" అని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొత్తగొల్ల శంకర్ మాట్లాడుతూ, "పార్టీపై విశ్వాసం, నాయకులపై అభిమానం ఉంటే యాదయ్యలాగే ఉండాలి. ఆయన చేసిన పని ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు. ప్రస్తుతం యాదయ్య పచ్చబొట్టు ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆయనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నాయి.



## కారులో గ్యాస్ నింపుతుండగా పేలుడు – 3 వాహనాలు దగ్ధం

**కామారెడ్డి మే 09 (ప్రజాక్షేత్రం) :**



కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఓ కారులో గ్యాస్ నింపుతుండగా ఒక్కసారిగా ట్యాంకు పేలింది. ఈ ప్రమాదంలో కారు పక్కన పార్కింగ్ చేసి ఉన్న మరో రెండు కార్లు, బైకులు దగ్ధమయ్యాయి. పేలుడు ధాటికి భారీ శబ్దం రావడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

# అసాంఘిక శక్తులే లక్ష్యంగా పోలీసుల 'కార్డన్ సెర్చ్'

- **అసాంఘిక శక్తులే లక్ష్యంగా పోలీసుల 'కార్డన్ సెర్చ్'**
- **చిల్కూరు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు**
- **సరైన పత్రాలు లేని 23 వాహనాలు స్వాధీనం**
- **ఏసీపీ కిషన్ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఆపరేషన్**

**మొయినాబాద్, మే 09(ప్రజాక్షేత్రం):**

నేర నివారణే లక్ష్యంగా, ప్రజలకు భద్రతా భావాన్ని కల్పించేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు రంగంలోకి దిగారు. శనివారం తెల్లవారుజామున మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్కూరు గ్రామంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్ క్వార్టర్స్‌లో పోలీసులు భారీగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. చేవెళ్ల ఏసీపీ బి. కిషన్ పర్యవేక్షణలో, మొయినాబాద్ ఎస్‌హెచ్‌ఓ వై. మల్లికార్జున రెడ్డి మరియు చేవెళ్ల జోన్ సిబ్బందితో కలిసి ఈ ఆపరేషన్ చేపట్టారు.

**అడుగడుగునా నిఘా..**

ఉదయం 6 గంటల నుండే కాలనీని చుట్టుముట్టిన పోలీసులు, అడుగడుగునా తనిఖీలు చేపట్టారు. అద్దెదారులు, కొత్త వ్యక్తులు మరియు అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి వివరాలను ఆరా తీశారు. అనుమానితుల వేలిముద్రలను పాపిలాన్ పరికరం ద్వారా సేకరించి, తెలంగాణ పోలీసుల ప్రతిష్టాత్మక అప్లికేషన్ ద్వారా వారి నేర చరిత్రను తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హోల్డింగ్ పాయింట్లు, పికప్ పార్టీలతో ఆపరేషన్‌ను శాంతియుతంగా ముగించారు.

**వాహనాల సీజ్..**

ఈ తనిఖీల్లో భాగంగా కాలనీలో ఉన్న మొత్తం 60 వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో సరైన పత్రాలు, నంబర్



ప్లేట్లు లేని 21 ద్విచక్ర వాహనాలు మరియు 2 ఆటోలను గుర్తించి, తదుపరి విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు.

**ప్రజలు సహకరించాలి: ఏసీపీ**

ఈ సందర్భంగా ఏసీపీ కిషన్ మాట్లాడుతూ.. సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు మరియు నేరాలను ముందస్తుగా అరికట్టేందుకే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, కొత్త వ్యక్తుల కదలికలపై సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మూసీలో పడిపోయిన మహిళను కాపాడిన హైడ్రా

హైదరాబాద్ మే 09(ప్రజాక్షేత్రం):గోల్నాక సమీపంలో మూసీలో పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను హైడ్రా సిబ్బంది కాపాడారు. హైడ్రా అధికారులు మాట్లాడుతూ శనివారం ఉదయం 10.51 గంటలకు హైడ్రా కంట్రోల్ రూమ్ కు ఫోన్ రాగా.. 11:07 గంటలకు హైడ్రా బృందాలు అక్కడకు చేరుకున్నాయి. అంబర్‌పేట్ సమీపంలోని గోల్నాక, భాగ్యనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇందిర (49) శుక్రవారం రాత్రి మూసీలో పడిపోయింది. ఆ సమీపంలో ఒడ్డుకు చేరే అవకాశం లేని చోట ఆమె మూసీలోకి జారి పడిపోయింది. రాత్రంతా ఆమె మూసీలోనే భయం భయంగా గడిపింది. కేకలు వేసినా ఎవరికీ వినపడలేదు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత స్థానికులు గుర్తించారు. బయటకు తీయడానికి అవకాశం లేకపోవడంతో హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 90001 13667 కు ఫోన్ చేసి స్థానికులు సమాచారం ఇచ్చారు. స్వామి రెస్క్యూ ఇంచార్జి టీమ్ 16 అంబర్‌పేట్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. హైడ్రా సహాయక చర్యలు జరుగుతుండగానే ఫైర్ సిబ్బంది కూడా అక్కడకు చేరుకున్నారు. పెద్ద నిచ్చెన సహాయంతో డీఆర్ఎఫ్ బృందం సభ్యులు కిందకు దిగి మూసీలో ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న మహిళను కాపాడారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులు, స్థానిక పోలీసులకు అప్పగించారు. పొరపాటున జారి పడిపోయినట్టు బాధితురాలు తెలిపింది. భర్త లేడని ఇద్దరు పిల్లలతో అక్కడే ఉంటున్నట్లు పేర్కొంది. ప్రాణాపాయ స్థితిలో



ఉన్న మహిళను హైడ్రా సిబ్బంది రక్షించిన తీరును స్థానికులు అభినందించారు.

## పోక్సో కేసు.. స్పందించిన సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్ మే 09(ప్రజాక్షేత్రం):**



తెలంగాణలో శాంతి భద్రతలు చూస్తే బాధాకరంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఒకప్పుడు తెలంగాణ పోలీస్ అంటే దేశంలో మొదటి స్థానంలో ఉండేదని, అలాంటి పోలీసింగ్ వెనక్కి పోతుంది అంటే బాధగా ఉందన్నారు. ఈ రాష్ట్రానికి హోంమంత్రి లేకపోవడం వల్లే ఇలా ఉందని, బీఆర్ఎస్ నాయకుల మీద పెట్టిన శ్రద్ధలో 1% అయినా శాంతి భద్రతల మీద పెడితే దేశం ముందు తల దించుకునే అవసరం ఉండదని ఎమ్మెల్యే సబితా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోకపోత దాడులు చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వార్నింగ్ ఇస్తున్నాడని, మరి రెండేళ్లలో రేవంత్ రెడ్డి మాట్లాడిన దానికి మేమెన్ని దాడులు చేయాలి, కానీ అది మా సంస్కారం కాదన్నారు. కాంగ్రెస్ బీజేపీ కొట్టుకోవడం కాదు బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలని బండి సంజయ్ అంటున్నాడు. ఒక కేంద్ర మంత్రిగా పోలీసులకు ఎలాంటి ఆదేశాలు ఇస్తున్నారు? మాజీ మంత్రి ప్రశ్నించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కొడుకు పోక్సో కేసు వ్యవహారంపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. తప్పు చేస్తే కేంద్ర మంత్రి కొడుకుకైనా సామాన్యుడి లాగా శిక్ష విధించాలని, పోక్సో కేసు నమోదు చేసి చట్ట పరంగా చర్యలు తీసుకోవాల్సిందే డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ కొడుకు బండి సాయి భగీరథ్ మీద పోక్సో కేసు నమోదైంది. తమ 17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడ్డాడని బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు పేర్కొన్నారు. మొయినాబాద్ ప్రాంతంలోని ఫార్మ్ హౌజ్‌తో పాటు మరో రెండు ప్రాంతాల్లో అత్యాచారం జరిగిందని, బీఎన్ఎస్ 74,75 సెక్షన్లతో పాటు, సెక్షన్ 11 ఆర్/డబ్ల్యూ12 పోక్సో చట్టం కింద బండి సాయి భగీరథ్ మీద పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ అంశంపై బండి సంజయ్ కుమారుడు భగీరథ్ హనీ ట్రాప్ కేసు పెట్టారు.

## ప్రధాని మోదీ బహిరంగ సభ.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు: సీపీ సుమతి

**హైదరాబాద్, మే 09(ప్రజాక్షేత్రం):**




ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు నగర యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఈ సభకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై నగర పోలీస్ కమిషనర్ సుమతి కీలక వివరాలను వెల్లడించారు. సభను ప్రశాంతంగా నిర్వహించేందుకు సుమారు 2,000 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా సభా ప్రాంగణంలోకి డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులను తీసుకురావడంపై నిషేధం విధించారు. బహిరంగ సభ దృష్ట్యా.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడకుండా ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రోడ్లపై ఎక్కడైనా వాహనాలను పార్క్ చేస్తే.. వాటిని వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సభకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 12 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశామని, వాహనదారులు పార్కింగ్ స్థలాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా అక్కడ క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు.

## కేంద్రం మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు..

- **తెలంగాణ రాజకీయాల్లో కలకలం***
- **మైనర్ బాలిక ఫిర్యాదుతో కేసు నమోదు..**
- **హనీ ట్రాప్ ఆరోపణలతో బండి సంజయ్ వర్గం ప్రతివాదం**

**హైదరాబాద్ మే 09(ప్రజాక్షేత్రం):**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మైనర్ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదు ప్రకారం, 17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. మొయినాబాద్ ప్రాంతంలోని ఫార్మ్‌హౌస్‌తో పాటు మరో రెండు ప్రాంతాల్లో ఈ ఘటనలు జరిగినట్లు బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించినట్లు సమాచారం. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్లు 74, 75తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11 r/w 12 కింద బండి సాయి భగీరథ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం పోలీసులు బాధితురాలి వాంగ్మూలం, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు, మెడికల్ సంబంధిత వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. ఇక బాధితురాలి తల్లిదండ్రులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. తమ కుమార్తెపై మానసిక ఒత్తిడి పెరగడంతో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కేసు నుంచి తప్పించుకునేందుకు తమ కూతురిపైనే తప్పుడు కేసులు పెట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అయితే ఈ వ్యవహారంపై బండి సంజయ్ వర్గం పూర్తిగా భిన్నమైన వాదన వినిపిస్తోంది. ఇది రాజకీయ ప్రేరేపిత "హనీ ట్రాప్" వ్యవహారమని, తమ వద్ద నుంచి రూ.5 కోట్ల డిమాండ్ చేశారని చెబుతున్నారు. రాజీ ప్రయత్నాల్లో భాగంగా రూ.50 వేల రూపాయలు ఇచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే "ఎలాంటి తప్పు చేయనప్పుడు డబ్బులు ఎందుకు ఇచ్చారు?" అన్న ప్రశ్న ఇప్పుడు సోషల్ మీడియాతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారి తీస్తోంది. ఈ అంశంలో నిజానిజాలు పోలీసు దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. ప్రస్తుతం ఈ కేసు రాజకీయంగా కూడా వేడెక్కుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండగా, సోషల్ మీడియాలో ఈ వ్యవహారం వైరల్‌గా మారింది. కేసు దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.





## ఈతవనం ధ్వంసంపై గీత కార్మికుల ఆగ్రహం

- బాధ్యులపై చర్యలకు నాయకుల డిమాండ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 09 (ప్రజాక్షేత్రం) :**

బోధన్ పట్టణ పరిధిలోని పసుపువాగు సమీపంలో దుండగులు బరితెగించారు. గీత కార్మికుల జీవనాధారమైన ఈతవనాన్ని లక్ష్యంగా చేసుకొని ఘాతుకానికి ఒడిగట్టారు. సుమారు 60 ఈత చెట్లను నరికివేయడమే కాకుండా, వాటికి నిప్పుపెట్టి దహనం చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధిత గీత కార్మిక సంఘం నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. పసుపువాగు ప్రాంతంలోని సర్వే నంబరు 594లో గల 8 ఎకరాల 6 గుంటల భూమి గీత కార్మిక సంఘానికి చెందింది. ఈ భూమిలో కార్మికులు ఈతవనాన్ని పెంచుకుంటూ కల్లు గీత ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. కాగా, శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు వనంలోకి చొరబడి యథేచ్ఛగా 60 వరకు ఈత చెట్లను నరికివేసి, అనంతరం వాటిని తగులబెట్టారు. ఏళ్ల తరబడి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న చెట్లు కళ్ల ముందే బూడిదవడంతో గీత కార్మికులు తల్లడిల్లిపోతున్నారు. తమ ఉపాధిని దెబ్బతీసి, పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కరరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి. గంగాధర్ గౌడ్, బి. లింగాగౌడ్, కందుకాల శ్రీకాంత్ గౌడ్, వై. జీవన్ గౌడ్, వై. రమేష్‌గౌడ్, ఎం. రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆధునిక సాగుతోనే అన్నదాతకు మేలు

- సాలూరలో ఇరిగేషన్ అధికారుల దిశానిర్దేశం
- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా 'రైతు వారం'

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 09 (ప్రజాక్షేత్రం) :**

సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ, ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేశారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శనివారం సాలూర రైతు వేదికలో నిర్వహించిన 'రైతు వారం' అవగాహన సదస్సులో ఇరిగేషన్ అధికారులు రైతులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సాలూర ఏఈ సుస్మిత, బోధన్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఫతేపూర్ ప్రాంతంలో నీటి నిల్వ సమస్యలను పరిష్కరించడంతో పాటు, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఇందుకోసం రూ. 31.44 లక్షల వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనుల ద్వారా స్థానిక ఆయకట్టు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వారు భరోసా ఇచ్చారు. అధికారులు క్షేత్రస్థాయికి రావడం లేదనే అపోహలను రైతులు వీడాలని, సర్వేలు మరియు అంచనాల రూపకల్పనలో తాము నిరంతరం క్షేత్రస్థాయిలోనే గడుపుతున్నామని అధికారులు స్పష్టం చేశారు. సాగునీటి వృధాను అరికట్టి, ఆధునిక పద్ధతుల్లో నీటిని వినియోగించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతుల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రభుత్వ ఆశయమని, సాగునీటి విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే రైతులు నేరుగా అధికారులను సంప్రదించవచ్చని ఉద్ఘాటించారు. ఈ సదస్సులో సర్పంచ్ సోక్కం లావణ్య, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.





## సామూహిక హనుమాన్ చాలీస పారాయణం....

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 09(ప్రజాక్షేత్రం ):-**



సోనాల గ్రామంలోని రామాలయంలో హిందూ ధర్మ జాగరణ మండలి వారి ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాల కిందట (23.12.2023)శనివారం రోజున ప్రారంభించిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగుతోంది. ప్రతి శనివారం రాత్రి 7 గంటలకు సభ్యుల తోపాటు భక్తులు, విద్యార్థులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొంటున్నారు.నేటి శనివారంతో ( 09.05.2026) 125వారాలను పూర్తి చేసుకున్నట్లు సభ్యులు తెలిపారు. హనుమాన్ చాలీసా పారాయణం వలన భక్తిశ్రద్ధలు, ఏకాగ్రత ,ఆధ్యాత్మికత,క్రమశిక్షణ, మంచి భావాలు, ధైర్యం ,తేజస్సు మొదలైన గుణాలు పెంపొందుతాయని సభ్యులు పేర్కొన్నారు . అనంతరం వారం వారం నిర్వహించే ఆధ్యాత్మిక ప్రశ్నావళి లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేయడం జరిగింది.

# బండి సంజయ్‌ని భర్తరఫ్ చేయాలి

- భగీరథ్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలి
- లైంగికదాడిపై మోదీ సమాధానం చెప్పాలి
- బండి కొడుకును కాపాడుతున్న రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి అమ్మాయి తల్లిదండ్రుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.
- సైబరాబాద్ కమిషనర్ మీడియాకు ఎందుకు చెప్పడం లేదు
- మీడియా సమావేశంలో బీఆరెస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్ మే 09(ప్రజాక్షేత్రం):**



కేంద్ర హోం శాఖ సహాయ శాఖ బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని, ఆయన కుమారుడు సాయి భగీరథ్ పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి వెంటనే జైలుకు పంపాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పిన భేటీ బచావో అంటే ఇదేనా? ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో మోదీ మహిళలకు సమాధానం చెప్పాలన్నారు. బేటీ బచావో... మహిళల రిజర్వేషన్ బిల్లు పెట్టిన అని ప్రగల్భాలు పలికుతున్న మోదీ.. బండి సాయి భగీరథ్ అకృత్యాల గురించి తెలంగాణ ప్రజలకు వివరించాలన్నారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. సైబరాబాద్ బాధితురాలి స్టేట్ మెంట్‌ను పోలీసు కమిషనర్.. మెజిస్ట్రేట్ ముందు రికార్డు చేయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి ఈ కేసులో బండి సంజయ్ కుమారుడిని కాపాడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, కరీంనగర్ పోలీసు కమిషనర్ ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీలను భద్రపర్చాలని కోరారు.

**బాధితురాలి తల్లిదండ్రులకు ప్రాణభయం**

బాధితురాలి తల్లిదండ్రులకు కూడా బండి సంజయ్ నుండి ప్రాణభయం ఉందని, వారికి ఏం జరిగినా రాష్ట్ర పోలీసులదే బాధ్యత అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దేనికీ పనికి రాని అంశాలపై సిట్‌లు వేశారని, ఈ కేసుపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. దేశాన్ని కాపాడే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సంబంధించిన మంత్రి కుమారుడు సాయి భగీరథ్ అరాచకాలపై ఒక బిడ్డకు తండ్రిగా, ఒక చెల్లికి అన్నగా మాట్లాడుతున్నానని ప్రవీణ్ తెలిపారు. బండి సంజయ్ కుమారుడిపై శుక్రవారం పోక్సో కేసు అత్యంత కష్టం మీద నమోదైందన్నారు. గతంలో బండి సంజయ్, ఆయన కుమారుడు మోదీని కలిసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

**కలిసే తిరిగామని భగీరథే చెప్పాడు**

సాయి భగీరథ్ ఫిర్యాదు చేయగానే శుక్రవారం సాయంత్రం కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 308, 351 సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సాయి భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదులో రకరకాల ఫ్యామిలీ ఫంక్షన్స్, స్నేహితులతో కలిసి జరిగిన పార్టీలకు, దేవాలయాలకు వెళ్లే క్రమంలో... ఒక మిత్రుడి ద్వారా అమ్మాయి పరిచయం అయినట్లు తెలిపారు. స్నేహం ముసుగులో కొన్ని పండుగలు, పార్టీలు, దేవాలయాలు విజయవాడ కనకదుర్గ అమ్మ వారు, తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లామని ఆయనే వివరించారు. కొన్ని రోజుల తర్వాత అమ్మాయి ప్రవర్తనలో మార్పు వచ్చిందని, తప్పుడు కేసులు పెడతామని బెదిరించారని, అత్యాచార కేసులు పెడతామని, డబ్బులు అడిగితే రూ.50 వేలు ఇచ్చానని పేర్కొన్నారు. తర్వాత అమ్మాయి ఆత్మహత్యా ప్రయత్నం చేసిందని? రూ.5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. గతంలో మహీంద్ర యూనివర్సిటీలో విద్యార్థులను ర్యాగింగ్ చేసి కొట్టినా, మద్యం తాగుతూ పార్టీ చేసుకునే భగీరథ్, 17 ఏళ్ల అమ్మాయికి నిజంగా భయపడుతడా ? అని ప్రవీణ్ కుమార్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**కరీంనగర్‌లో కేసు తర్వాత.. బాధితురాలి తల్లి ఫిర్యాదుపై కేసు**

బాధితురాలి తల్లి శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు ఫార్చునర్ కారులో వచ్చారని, బాధితురాలి తండ్రికి బెంజ్ కారు ఉందని ప్రవీణ్ కుమార్ వివరించారు. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేయలేదని, ముందు ఒక ఎస్సై మాట్లాడి, తర్వాత సీఐ మాట్లాడన్నారు. బండి సంజయ్ కొడుకు పై వచ్చిన ఫిర్యాదుకు సంబంధించి సైబరాబాద్ పోలీసు కమిషనర్ తో పాటు ఏసీపీ, సీఐ లు ఇప్పటి వరకు ఎందుకు ప్రెస్ మీట్ పెట్టలేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు బాధితురాలి స్టేట్‌మెంట్ ఎందుకు రికార్డు చేయడం లేదు? మెజిస్ట్రేట్ ముందు ఎందుకు ప్రవేశపెట్టలేదని నిలదీశారు. బాధితురాలి తల్లి వచ్చి ఫిర్యాదు చేస్తే సుమారు 8 గంటల తర్వాత 684/2026 కింద ఎఫ్ఐఆర్ చేశారని ప్రవీణ్ తెలిపారు. కానీ బీఎన్ఎస్ 74, 75, పోక్సో 11, 12 సెక్షన్ల ప్రకారం కేవలం 2, 3 ఏళ్ల శిక్ష పడే కేసులు పెట్టి స్టేషన్ బెయిల్ వచ్చే విధంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. 8 గంటలు పడిగాపులు కాస్తే... అధికారులు అందరూ కలిసి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుకొని కరీంనగర్ లో కేసు నమోదైన తర్వాత పేట్ బషీరాబాద్‌లో కేసు పెట్టారని ప్రవీణ్ కుమార్ విమర్శించారు.

**బండి కొడుకు గురించి మోదీ మాట్లాడాలి**

ఆదివారం నాడు సాయంత్రం సికింద్రాబాద్ ఫరేడ్ గ్రౌండ్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పక్కనే బండి సంజయ్ కుర్చుంటాడన్నారు. రాష్ట్రంలోని లక్షలాది మహిళలకు బండి సంజయ్ కొడుకు గురించి చెప్పండన్నారు. ఆ అమ్మాయితో ఫోన్ లో చాలాసార్లు మాట్లాడాడు, చాటింగ్ చేశాడన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ ఫాం హౌజ్, హైదరాబాద్ ఉత్తర దిశలో అమ్మాయి ఇంట్లో బేస్ మెంట్ దగ్గర, నానక్ రాం గూడలో మూడు సార్లు అత్యాచార యత్నం చేశాడన్నారు. మొయినాబాద్ లో డిసెంబర్ 31వ తేదీన కూల్ డ్రింక్ లో మత్తు మందు కలిపి అత్యాచారం చేశాడన్నారు. తెలంగాణలో ఇంటలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తుంది ? సైబరాబాద్ పోలీసులు ఏం చేస్తున్నారు ? అని ఆయన అడిగారు. ఎప్పుడూ మొయినాబాద్ ఫాం హౌస్ లపై నిఘా ఉంచే రాష్ట్ర పోలీసులు బండి సంజయ్ కొడుకును ఎందుకు వదిలేశారో సమాధానం చెప్పాలన్నారు. అమ్మాయిని మేజర్ అయ్యాక పెళ్లి చేసుకుంటానని చెప్పి, ఇపుడు చేసుకోనని చెప్పడంతో... ఆమె ఆత్మహత్యకు కూడా ప్రయత్నించిందన్నారు. ఉరేసుకొని, చేయి కోసుకొని చనిపోవాలని ప్రయత్నించడం అత్యంత ఘోరం అన్నారు. వీ6 టీవీ ఛానల్ లో జర్నలిస్టుగా పనిచేసి కొద్ది సంవత్సరాల క్రితం బీజేపీ లో చేరిన ఒక వ్యక్తి ఈ కేసులో బ్రోకర్ పనిచేస్తున్నారన్నారు. కేసు పెట్టవద్దని బండి సంజయ్ తో మాట్లాడి... కేసు కాంప్రమైజ్ చేయాలని చూస్తున్నాడన్నారు. పోలీస్ స్టేషన్ లో ఉండగానే కేసు వాపస్ తీసుకోవాలని ఒత్తిడి చేశారన్నారు. నిర్మల్ లో సంజయ్ ప్రోద్బలంతోనే ఏప్రిల్ నెలలో అమ్మాయి, తల్లిదండ్రుల మీద ఎక్స్ ట్రాక్షన్ కేసులు నమోదు చేయించారన్నారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.

**బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ సృష్టి.. హనీట్రాప్**

బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ లు, సోషల్ మీడియా కార్యకర్తలు హనీ ట్రాప్ అస్త్రం అంటూ... వసూళ్ల పర్వం.. కేంద్ర మంత్రి కొడుకును బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ.. రూ.5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని, అమ్మాయి మైనర్ కాదని... డబ్బు రాలేదని మీడియా సహాయంతో వివాదాస్పదం చేస్తున్నారని, అమ్మాయి తల్లిని చలాకీ అంటూ దారుణంగా మాట్లాడుతున్నారని ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. హనీ ట్రాప్ అనేది గూఢాచారి, దేశ భద్రత, న్యూక్లియర్ రహస్యాలు చూసే పెద్ద వ్యక్తులను చేస్తారన్నారు. మహా న్యూస్ టీవీ ఛానల్ లో అమ్మాయి మీద తప్పుడు వార్తలు వేస్తున్నారని, గతంలోనే ఈ ఛానల్ పై దాడులు జరగ్గా... బండి సంజయ్ వెనుకేసుకొచ్చి సహకరించారు. ఇలాంటి వదంతులు ప్రచారం చేయడం మహా టీవీ వెంటనే ఆపాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ హెచ్చరించారు.

**బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి...**

బండి సాయి భగీరథ్ సంబంధించిన కేసు పై ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు తీవ్రంగా స్పందించారు. ఆరోపణలు తీవ్ర స్వరూపం కలిగినవిగా ఉన్న నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు. అధికార బలంతో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరిగితే ప్రజలు సహించరని ఆమె హెచ్చరించారు.

# డబుల్ ఇంజన్ సర్కార్ తోనే అభివృద్ధి సాధ్యం

- బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి

**నిజామాబాద్ జిల్లా, మే 09 (ప్రజాక్షేత్రం) :**



ప్రధాని నరేంద్ర మోదీ భాగ్యనగర పర్యటనను పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేస్తున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి వెల్లడించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంగ, వంగ, కళింగ దేశాలను గెలిచి త్రిలింగ దేశమైన తెలంగాణను కాషాయమయం చేసేందుకు విచ్చేస్తున్న ప్రపంచ ప్రియతమ నేత మోదీకి ఇందూరు గడ్డ ఘనస్వాగతం పలుకుతుందన్నారు. 25 ఏళ్లుగా ప్రజాప్రతినిధిగా ఉండి కూడా సొంత ఇల్లు, బ్యాంకు బ్యాలెన్స్ లేకుండా దేశమే తన కుటుంబంగా భావిస్తున్న మహోన్నత వ్యక్తి మోదీ అని కొనియాడారు. నేడు హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభకు నిజామాబాద్ జిల్లా నుంచి సుమారు 15 వేల మందికి పైగా తరలివస్తున్నారని, ఇందుకోసం ఇప్పటికే 150 బస్సులు, వందలాది వాహనాలు సిద్ధమయ్యాయని వివరించారు. వాహనాల కొరత ఉన్నప్పటికీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు రైళ్లలో కూడా తరలివచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారని, ఇది ప్రధానిపై ఉన్న ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణలో అవినీతి రహిత పాలన అందాలన్నా, నిరుపేదలకు ఇళ్లు మరియు సంక్షేమ పథకాలు చేరాలన్నా డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందని దినేష్ కులాచారి స్పష్టం చేశారు. గత పదేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకున్న కుటుంబ పార్టీలకు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు కాలం చెల్లిందని, వచ్చే ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో అరాచకాలను ఎదిరించి బిజెపి సాధించిన విజయ స్ఫూర్తితో తెలంగాణలోనూ కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా బాన్సువాడలో సాగుతున్న ఇసుక మాఫియాపై తమ పోరాటం కొనసాగుతుందని, కార్యకర్తలకు జిల్లా నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హిందూ సంస్కృతిపై దాడులు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించిన ఆయన, దేశం మరియు రాష్ట్రం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్కరూ రేపటి సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బూత్ స్థాయి అధ్యక్షుల నుండి జిల్లా పదాధికారుల వరకు అందరూ సమన్వయంతో ఈ సన్నాహక కార్యక్రమాల్లో నిమగ్నమైనట్లు ఆయన తెలిపారు.

# పరీక్షల వేళ 163 సెక్షన్ అమలు.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**నిజామాబాద్ జిల్లా, మే 09 (ప్రజాక్షేత్రం) :**




జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 13 నుంచి 19 వరకు జరగనున్న ఈ పరీక్షల దృష్ట్యా కమిషనరేట్ పరిధిలోని 39 కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడించారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా చేరడం నిషేధమని, పరీక్షా సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ షాపులను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని ఆకాంక్షిస్తూ వారికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మరోవైపు జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను పోలీసులు ఉధృతం చేశారు. గత వారం రోజులుగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మొత్తం 151 మంది పట్టుబడగా, కోర్టు వారికి రూ. 10.40 లక్షల జరిమానా విధించింది. వీరిలో 11 మందికి నేరం తీవ్రతను బట్టి వారం రోజుల జైలు శిక్ష పడింది. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రాణాపాయంతో పాటు ఇన్సూరెన్స్ లభించదని, మైనర్లు పట్టుబడితే వాహన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. సవరించిన మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు తప్పవని వాహనదారులకు హితవు పలికారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలు లేదా ప్రాంతాల నుండి వచ్చే వలస కార్మికులు, అద్దెదారుల పట్ల గృహ యజమానులు మరియు వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి పేరు, శాశ్వత చిరునామా, ఆధార్ కార్డు మరియు కుటుంబ వివరాలను సేకరించి భద్రపరచుకోవాలని, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని, ప్రజల అప్రమత్తతతోనే నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందని ఈ సందర్భంగా సీపీ పేర్కొన్నారు.

ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక

10.05.2026
ఆదివారం | హైదరాబాద్

## రణబాలి మేకింగ్ వీడియో వచ్చేసింది.. ప్రాణాలను పణంగా పెట్టిన విజయ్ దేవరకొండ

టాలీవుడ్ యువ నటుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం రౌడీ జనార్ధన సినిమాతో పాటు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న రణబాలి అనే చిత్రంలో కూడా హీరోగా నటిస్తున్నాడు. ఇందులో రష్మిక మందన్న విజయ్‌కు జోడిగా కనిపించనుండగా, మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈరోజు విజయ్ పుట్టినరోజు సందర్భంగా రణబాలి చిత్ర బృందం ఈ సినిమా నుండి ఓ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. అందులో విజయ్ గుర్రంపై స్వారీ చేస్తున్న సన్నివేశాలు కనిపిస్తాయి. అయితే ఆ గుర్రంపై పర్ఫెక్ట్‌గా స్వారీ చేయడానికి ఆయన ఎంత ప్రమాదాన్ని ఎదుర్కొన్నాడో ఈ వీడియోలో చూపించారు. ఈ మేకింగ్ వీడియో ప్రకారం దాదాపు రెండు సార్లు గుర్రం ఎక్కిన సమయంలో అది విజయ్‌ను కింద పడేసింది. దాంతో ఆయన గాయాల పాలయ్యాడు. అయినప్పటికీ పట్టు వదలకుండా అదే గుర్రంపై స్వారీ చేయాలనే దృఢ సంకల్పంతో తీవ్రంగా శ్రమించి చివరకు విజయవంతంగా దానిపై స్వారీ చేశాడు. ఈ మొత్తం ప్రాసెస్‌ను చూపిస్తూ చిత్ర బృందం విడుదల చేసిన ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియో చూసిన అభిమానులు "డెడికేషన్ అంటే ఇదే" అంటూ విజయ్ దేవరకొండపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఏదేమైనా ఈ వీడియో చూసిన తర్వాత చాలామంది విజయ్ ధైర్యం, కష్టపడే తత్వానికి ఫిదా అవుతున్నారు.




## నెంబర్ 1 ట్రెండింగ్‌లో దూసుకెళ్తున్న అడివి శేష్ డెకాయిట్



అడివి శేష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్' ఓటీటీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఈ చిత్రం మే 8, 2026న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలైన వెంటనే ఇండియా వైడ్ నెంబర్ 1 స్థానాన్ని దక్కించుకుంది. ఓటీటీలోకి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్పేస్‌లో కూడా భారీ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది.

మంచి కంటెంట్‌ను ఎంపిక చేసుకోవడంలో అడివి శేష్‌కు ఉన్న విజన్ ని మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్న కథలు, బలమైన కథనాలతో ఆయనకు ఉన్న క్రేజ్ 'డెకాయిట్'తో మరింత బలపడింది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించగా, ఇద్దరి నటన సినిమాకి ప్రధాన బలంగా నిలిచింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్, కామాక్షి భాస్కర్ల వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించారు. దర్శకుడిగా పరిచయమైన షనీల్ డియో ఈ చిత్రాన్ని స్టైలిష్‌గా, గ్రిప్పింగ్‌గా తెరకెక్కించారు. సినిమాటోగ్రాఫర్ ధనుష్ భాస్కర్ విజువల్స్, కొడాటి పవన్ కళ్యాణ్ ఎడిటింగ్, భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాకి మరింత బలం చేకూర్చాయి. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియా యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించిన ఈ చిత్రంలో ఉన్న హై ప్రొడక్షన్ వాల్యూస్ డిజిటల్ స్క్రీన్‌పైనా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## బాలయ్య-కొరటాల మూవీ.. అస్సలు ఊహించని టైటిల్?



నందమూరి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ పట్టాలెక్కబోతోంది. మాస్ డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వంలో నటసింహం బాలకృష్ణ హీరోగా ఒక భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక పవర్‌ఫుల్ టైటిల్ ఖరారైనట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ చిత్రానికి 'కార్పెంటర్' అనే విభిన్నమైన టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు సమాచారం. సాధారణంగా కొరటాల శివ సినిమాల్లో బలమైన సామాజిక సందేశంతో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉంటాయి. కార్పెంటర్ అనే టైటిల్‌ను బట్టి చూస్తుంటే.. బాలయ్య పాత్ర ఈసారి చాలా కొత్తగా, లోకల్ సెటప్‌లో అత్యంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది. బాలకృష్ణ మార్క్ డైలాగులు, కొరటాల మార్క్ ఎమోషన్స్ కలిస్తే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమే. ఇక ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్. ప్రస్తుతం సౌత్ ఇండియాలో టాప్ ఫామ్‌లో ఉన్న అనిరుధ్.. బాలయ్య సినిమాకు మ్యూజిక్ అందించబోతుండటం ఇదే తొలిసారి.

బాలకృష్ణ ఎనర్జీకి తగ్గట్టుగా అనిరుధ్ ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సాంగ్స్ ఇస్తారోనని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ కాంబినేషన్ మ్యూజికల్ పరంగా కూడా సెన్సేషన్ క్రియేట్ చేయనుంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, అతి త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోందని తెలుస్తోంది. అయితే కార్పెంటర్ టైటిల్ విషయంలో మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## రామ్ చరణ్ కోసం రంగంలోకి టీమ్ ఇండియా లెజెండ్..



రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్లు ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో లేవని మెగా అభిమానులు కొంత అసంతృప్తిగా ఉన్నారు. అయితే, ఈ లోటును పూడ్చేందుకు చిత్ర యూనిట్ ఒక భారీ 'మైండ్ బ్లాకింగ్' ప్లాన్‌తో సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సినిమా క్రీడా నేపథ్యం (స్పోర్ట్స్ డ్రామా), ముఖ్యంగా క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుండటంతో, ప్రమోషన్ల కోసం ఒక అరుదైన అతిథిని తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు.

తాజా సమాచారం ప్రకారం, జార్ఖండ్ రాజధాని రాంచీలో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ఈ వేడుకకు భారత మాజీ కెప్టెన్, క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ (MS Dhoni)ని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని చూస్తున్నట్టు గట్టిగా వినిపిస్తోంది. ధోనీ స్వస్థలం రాంచీ కావడం, అలాగే సినిమా క్రీడా నేపథ్యంలో ఉండటంతో ఆయన రాక సినిమాకు భారీ హైప్ తీసుకొస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. ప్రస్తుతానికి ధోనీతో సంప్రదింపులు జరుగుతున్నాయని, ఇంకా ఏదీ అధికారికంగా ఖరారు కాలేదని తెలుస్తోంది. ఒకవేళ ధోనీ ఈ ఈవెంట్‌కు హాజరైతే మాత్రం, నార్త్ ఇండియా మార్కెట్‌లో 'పెద్ది' సినిమాకు తిరుగులేని ప్రచారం లభిస్తుందని చెప్పొచ్చు. రామ్ చరణ్ మాస్ ఇమేజ్, ధోనీ క్రేజ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయం.

## లాలా అమర్‌నాథ్ బయోపిక్.. మళ్ళీ 'లగాన్' కాంబో రిపీట్ !



బాలీవుడ్ వెండితెరపై ఎన్నో అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి, కానీ అమీర్ ఖాన్ నటించిన 'లగాన్' సినిమా సృష్టించిన ఇంపాక్ట్ మాత్రం ప్రత్యేకం అనే చెప్పాలి. అశుతోష్ గౌరీకర్ దర్శకత్వంలో వచ్చిన ఆ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా ఆస్కార్ వరకు వెళ్లి భారతీయ సినిమా గర్వపడేలా చేసింది. మళ్ళీ ఇన్నాళ్ల తర్వాత ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ పునరావృతం కాబోతుందనే వార్త ఇప్పుడు నెట్టింట సెన్సేషన్‌గా మారింది. గత కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న అమీర్ ఖాన్, తనకి 'లగాన్' వంటి క్లాసిక్ ఇచ్చిన దర్శకుడితోనే మళ్ళీ చేతులు కలపడం ట్రేడ్ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.

మరింత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ సినిమా కూడా క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లోనే ఉండబోతోందట. భారత క్రికెట్ దిగ్గజం, లెజెండరీ ప్లేయర్ లాలా అమర్‌నాథ్ బయోపిక్ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. 1947 నాటి పరిస్థితులు, ఆ కాలంలో క్రికెట్ నేపథ్యం చుట్టూ ఈ కథ తిరుగుతుందట. 'లగాన్' సినిమా కూడా పీరియాడిక్ డ్రామాగానే వచ్చి సంచలనం సృష్టించింది, ఇప్పుడు మళ్ళీ అదే జోనర్‌లో ఈ ఇద్దరూ సినిమా చేస్తుండటంతో అమీర్ ఖాన్ బాక్సాఫీస్ వద్ద తన పూర్వ వైభవాన్ని చాటుకోవడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్‌పై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశం ఉంది.

## 'పెద్ది' ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్.. ఈవెంట్ మాత్రం ఇక్కడ కాదండోయ్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ మల్టీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. జూన్ 4న ఈ సినిమా రిలీజ్ కానుండగా.. ప్రమోషన్ల విషయంలో చిత్ర యూనిట్ అదిరిపోయే ప్లాన్లతో ముందుకు వెళ్తోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్‌కు సంబంధించి ఒక సెన్సేషనల్ అప్‌డేట్ బయటకు వచ్చింది. పెద్ది ట్రైలర్‌ను మే 16న గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నట్టుగా తెలుస్తోంది.

ట్రైలర్ ఈవెంట్‌ను మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో నిర్వహించబోతున్నారని తెలుస్తోంది. ఈ వేడుకకు హీరో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్, దర్శకుడు బుచ్చిబాబు సహా చిత్ర యూనిట్ హాజరు కానుందని టాక్. నార్త్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ లొకేషన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఈవెంట్‌ను కేవలం ఒక సినిమా వేడుకలా కాకుండా.. ఒక మ్యూజికల్ ఫెస్టివల్‌లా నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నారట. అందుకోసం ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ లైవ్ పెర్ఫార్మెన్స్ కూడా ఇవ్వబోతున్నారట.

అయితే పెద్ది ట్రైలర్ లాంచ్ డేట్, ఈవెంట్ ఎక్కడ? అనే విషయాల్లో మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. కానీ బుచ్చిబాబు మాత్రం పెద్ది ట్రైలర్‌ను ఓ రేంజ్‌లో కట్ చేసినట్టుగా సమాచారం. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా.. ట్రైలర్ వచ్చాక అది నెక్స్ట్ లెవల్‌కి వెళ్తుందని ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. మరి రోజు రోజుకి అంచనాలు పెంచేస్తున్న పెద్ది.. బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



## 60 శాతం పూర్తయిన 'కల్కి 2'.. ప్రభాస్ నెక్స్ట్ ఫోకస్ దానిపైనే?

ప్రభాస్ ప్రస్తుతం నటిస్తున్న చిత్రాలలో 'కల్కి 2' ఒకటి. ఈ సినిమాకు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ ఇందులో కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. అలాగే లోకనాయకుడు కమల్ హాసన్ ఈ చిత్రంలో విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఈ మూవీ మొదటి భాగం అద్భుతమైన విజయాన్ని సాధించడంతో రెండవ భాగంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఇప్పటివరకు ఈ సినిమాకు సంబంధించిన 60 శాతం షూటింగ్ పూర్తయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ విదేశీ పర్యటనలో ఉన్నారు.

తిరిగి వచ్చిన తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నట్లు సమాచారం. ఆ సినిమాకు సంబంధించిన షెడ్యూల్ పూర్తైన తర్వాత మళ్లీ 'కల్కి 2' షూటింగ్‌లో పాల్గొననున్నారని తెలుస్తోంది. ఈ రెండు సినిమాలతో పాటు ప్రభాస్, హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' చిత్రంలో కూడా హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది దసరా లేదా డిసెంబర్ నెలలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇలా వరుస సినిమాల షూటింగ్‌లతో ప్రభాస్ ప్రస్తుతం చాలా బిజీగా ఉన్నారు.



## ఆయన నాలోని సరికొత్త కోణాలు చూపించారు..



బాలీవుడ్ యంగ్ హీరోయిన్ శార్వరి వాఘ్ 'మై వాపస్ ఆవుంగా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం జూన్ 12న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, శార్వరి ఈ సినిమాలోని 'మస్కారా' పాట చిత్రీకరణకు సంబంధించిన బిహైండ్ ద సీన్స్ ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తూ, దర్శకుడు ఇంతియాజ్ అలీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శార్వరి ఈ పాటలోని ఫీలింగ్ గురించి చెబుతూ, 'కిస్-మిస్ యారా' అనే పదాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది ఒక కల్పిత పదం అయినప్పటికీ, మొదటిసారి ప్రేమలో పడినప్పుడు మనసులో కలిగే ఆ మధురమైన అలజడిని ఇది అద్భుతంగా వివరిస్తుందని ఆమె అన్నారు. సినిమాలో తన పాత్ర అయిన 'జియా' జీవితంలో ఈ ఎమోషన్ చాలా కీలకం అని, ఆ భావాలను పండించడంలో ఇంతియాజ్ అలీ తనకు ఎంతో సహాయం చేశారని శార్వరి పేర్కొన్నారు.

దర్శకుడు ఇంతియాజ్ అలీ గురించి శార్వరి ఎంతో గొప్పగా రాశారు. "ఇంతియాజ్ సర్ ప్రతి సీన్ వెనుక ఉండే ఎమోషన్‌ను ఎంతో స్పష్టంగా వివరిస్తారు. నాలో ఉన్న సరికొత్త కోణాలను ఆయన నాకు పరిచయం చేశారు. షూటింగ్ సమయంలో ఇంతియాజ్ చూపించిన ఓపిక, నమ్మకం, ప్రేమ నన్ను ఒక మంచి నటిగా తీర్చిదిద్దాయి. ఆయన కథ చెప్పే విధానాన్ని గమనించడం ద్వారా నేను చాలా నేర్చుకున్నాను" అని ఆమె తన నోట్‌లో రాశారు. ఈ ప్రయాణం తన జీవితంలో మర్చిపోలేనిదని, 'జియా'గా మారడంలో ఆయన ప్రోత్సాహం మరువలేనిదని ఆమె ఎమోషనల్ అయ్యారు. దర్శకుడు ఇంతియాజ్ అలీ ఈ సినిమా నేపథ్యం గురించి మాట్లాడుతూ.. ఇది కేవలం ఊహాజనిత కథ కాదని, దేశ విభజన సమయంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందించినట్లు తెలిపారు. ఆ భయంకరమైన రోజుల్లో కూడా ప్రజల మధ్య ఉన్న స్వచ్ఛమైన ప్రేమ, పర్సనల్ బాండింగ్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుందని అన్నారు. శార్వరి షేర్ చేసిన ఈ ఫోటోలు, ఆమె రాసిన ఎమోషనల్ నోట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. జూన్ 12న విడుదల కాబోతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394